




ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి తుమ్మల

రాజకీయాలకు అతీతంగా
సంక్షేమ పథకాలు

- అభివృద్ధిలో ఎలాంటి రాజీ లేదు
- అర్హత కలిగిన వారందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- రూ.2.5కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన


ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలుంటాయని.. నిరుపేదలు, అర్హత కలిగిన వారికి సంక్షేమ పథకాలు అమలు చేసే సమయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరిస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. అభివృద్ధిలో ఎలాంటి రాజీ పడబోమన్నారు. అర్హత కలిగిన వారందరికీ ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కల నెరవేరుతుందన్నారు. ఆదివారం నగరంలోని 57వ డివిజన్ రమణగుట్టలో రూ.2.5 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మంత్రి తుమ్మలను కలిసి రమణగుట్ట ప్రాంతంలో నిరుపేదలు అధికంగా ఉంటారని.. సంక్షేమ పథకాలు, ఇందిరమ్మ ఇళ్లు ఎక్కువగా మంజూరు చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ఖమ్మం నియోజకవర్గంలో 2వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తే ఒక్క 57వ డివిజన్‌లోనే 200 ఇళ్లు ఇచ్చామన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో అర్హత కలిగిన లబ్ధిదారులకు (మిగతా 6వ పేజీలో)



సురవరానికి ఉప ముఖ్యమంత్రి భట్టి నివాళులు

సీపీఐ జాతీయ నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ నివాళులు అర్పించారు. ఈ మేరకు వారు ఆదివారం హైదరాబాద్‌లోని మక్దూం భవన్‌లో ఉంచిన సురవరం భౌతిక కాయన్ని సందర్శించి నివాళులర్పించారు.

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం సంక్షేమ విభాగం



ఎడాపెడా గర్భాశయ కోతలు!

జిల్లాలో పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యులు ఎడాపెడా గర్భాశయ కోతలు చేస్తున్నారు. అవసరం ఉన్నా.. లేకున్నా.. గైనిక్ సమస్యలతో తమ వద్దకు వచ్చే మహిళలను భయపెడుతూ మరీ శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. మహిళలు గైనిక్ సమస్యలతో వైద్యుల వద్దకు వెళ్తే.. కొందరు వాటికి చికిత్స అందించడాన్ని పక్కన పెడుతున్నారు. పైగా పిల్లలు పుట్టారు కాబట్టి ఇక గర్భసంచితో అవసరం లేదని.. గర్భసంచి ఉంటే ముందు క్యాన్సర్ వచ్చే అవకాశాలున్నాయని భయపెడుతూ.. అకారణంగా గర్భసంచిని తొలగిస్తున్నారు. ఇలాంటి సర్జరీల ద్వారా పెద్దమొత్తంలో ప్రైవేటు ఆస్పత్రులు రోగుల నుంచి డబ్బులు గుంజుతున్నారు. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు పక్కనే ఉన్న మహబూబాబాద్, సూర్యాపేట, నల్గొండ, కృష్ణా జిల్లా నలుమూలల నుంచి వచ్చే ఇక్కడి ఆస్పత్రులకు వచ్చే మహిళలకు ఇలాంటి బూచీ చూపించి గర్భసంచిని తొలగిస్తున్నారు. గిరిజన ప్రాంతాల మహిళలకు మాయమాటలు చెప్పి వైద్యులు, ఆర్ఎంపీలతో కుమ్మక్కై.. ఇలాంటి దారుణాలకు ఒడిగడుతున్నారు. జిల్లాలో 100 మంది మహిళల్లో కనీసం 25 మందికి గర్భసంచీలు లేవంటే ఈ పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చు.



- ప్రైవేటు ఆస్పత్రుల్లో కాసుల కోసం వైద్యుల కక్కుర్తి
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అత్యధికం
- అనవసర శస్త్ర చికిత్సలతో అనర్థాలే..
- స్పష్టం చేస్తున్న వైద్య నిపుణులు

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : వాస్తవానికి సమస్యకు గల మూల కారణాన్ని గుర్తించి చికిత్స అందిస్తే వంద శాతం గర్భాశయాన్ని తొలగించాల్సిన అవసరం ఉండదు. గర్భసంచి తొలగింపు శస్త్ర చికిత్స చేయించుకున్న వారిలో అత్యధికులు వ్యవసాయ కూలీలు, చిన్న రైతు కుటుంబాలకు చెందినవారే ఉంటున్నారు. బలహీన వర్గాలకు చెందిన మహిళలే అధికంగా ఉంటున్నారు. గర్భాశయాలు తొలగించిన స్త్రీలలో 33శాతం మందిలో అండాశయాలనూ తొలగిస్తున్నారు. ఈ మహిళలు శారీరకంగా కష్టపడి పనిచేసే వారే అయినా.. గర్భసంచి తొలగింపు కారణంగా ఎముకల్లో పెలుసుతనం ఎక్కువగా ఉండి, భవిష్యత్‌లో వారి పనులు వారు చేసుకోలేని పరిస్థితికి దిగజారుతున్నారు. శరీరంలో ప్రతీ అవయవానికి ఒక పరమార్థం ఉంటుంది. ఎన్నో కీలకమైన బాధ్యతలు నిర్వర్తిస్తుంటుంది. అలాంటిది ఉన్న పళంగా ఒక అవయవాన్ని తొలగిస్తే!? కచ్చితంగా సమస్యలు చుట్టుముడతాయంటున్నారు వైద్య నిపుణులు. గర్భసంచి విషయంలో అలాంటి ఘోరాలే జరుగుతున్నాయి. చిన్న చిన్న సమస్యలతోనే గర్భాశయాన్ని తొలగిస్తుండడం.. ఆయా మహిళల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. దీన్ని తొలగించిన తర్వాత క్రమంగా దీర్ఘకాలంలో తీవ్రమైన అనారోగ్య సమస్యల బారినపడే అవకాశాలుంటాయని చెబుతున్నారు. చిన్న వయసులోనే మహిళల గర్భాశయాలను (మిగతా 6వ పేజీలో)

ఎప్పుడు తొలగించాలంటే.. !?

- గర్భసంచిలో కొబ్బరి బొండాం అంత పెద్ద పరిమాణంలో గడ్డలున్నప్పుడు
- ప్రసవ సమయంలో తీవ్రంగా రక్తస్రావం అవుతున్నప్పుడు
- క్యాన్సర్ సోకినప్పుడు
- గర్భాశయం కిందకు జారిపోయినప్పుడు
- మందులతో నివారణ కాని చీము సంచులున్నప్పుడు. అవి లోపల పగిలినప్పుడు తొలగించాల్సి ఉంటుంది.

మందులతో తగ్గించవచ్చు....!

డాక్టర్ ఎం రాధిక (గైనకాలజీ అసోసియేట్ ప్రొఫెసర్, జిల్లా జనరల్ ఆస్పత్రి, ఖమ్మం)



మహిళలకు ప్రతి నెలా వచ్చే పీరియడ్స్‌లో తీవ్ర రక్తస్రావం, భరించలేని నొప్పి ఉంటే ఒకటికి రెండు సార్లు పరిశీలించి మందుల వినియోగం తర్వాత కూడా తగ్గకుంటే తొలగించడానికి ప్రయత్నించాలి. గర్భసంచికి గాయాలున్నా, గడ్డలు ఏర్పడినా.. కాన్సర్ , గర్భాశయం కిందికి జారడం వంటి ప్రత్యేక సందర్భాల్లోనూ గర్భసంచిని తొలగించవచ్చు. కానీ ప్రతి గైనిక్ సమస్యకు గర్భాశయమే కారణం కాదు. సమస్యకు గల కారణాలు తెలుసుకుంటే వందశాతం మందులతో పరిష్కరించవచ్చు. వాస్తవానికి గర్భసంచి తొలగిస్తే మహిళలకు దాని మూలంగా అనేక ఇతర ఆరోగ్య సమస్యలు కూడా ఉత్పన్నం అయ్యే ఆస్కారం ఉంటుంది. అందువల్ల 45 ఏళ్ల తర్వాతే హిస్టెరెక్టమీ ఆపరేషన్‌కు వెళ్లాలి.



భువనేశ్వర్ (ఫైల్)

రొటోవేటర్‌లో పడి బాలుడి మృతి

కూసుమంచి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్ రొటోవేటర్ కింద పడి భువనేశ్వర్ (6) అనే బాలుడు మృతి చెందిన ఘటన ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం కొత్తతండాలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని లోక్యాతండాకు చెందిన వడిత్య రాంబాబు-దీపిక దంపతులకు ఇద్దరు కవల పిల్లలున్నారు. ఆదివారం సాయంత్రం తన ట్రాక్టర్‌పై పిల్లలను కూర్చోబెట్టుకుని కొత్త తండాలో గల వ్యవసాయ క్షేత్రంలోకి వెళ్లాడు. ఈ క్రమంలో బాలుడు కదులుతున్న ట్రాక్టర్‌పై నుంచి ప్రమాదవశాత్తు రొటోవేటర్ కింద పడిపోయాడు. దీన్ని చూసుకోని తండ్రి ట్రాక్టర్‌ను ముందుకు నడపడంతో.. బాలుడు నుజ్జయ్యాడు. కళ్ల ఎదుటే కన్న కొడుకు చనిపోవడంతో తల్లిదండ్రులు రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆశల పల్లకిలో..



- మళ్లీ తెరపైకి 'స్థానిక' ఎన్నికలు
- త్వరలోనే నామినేటెడ్ పదవుల పందేరం
- అధికార పార్టీ నేతల్లో చిగురిస్తున్న ఆశలు

> ఓవైపు త్వరలోనే స్థానిక సంస్థలు.. మరోవైపు నామినేటెడ్ పదవులు.. వెరసి అధికార పార్టీ నేతల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం వచ్చే నెలలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించబోతుందన్న ప్రచారం కాంగ్రెస్ కేడర్‌లో బలంగా వినిపిస్తోంది. ఈ సమయంలో నామినేటెడ్ పదవులు కూడా వస్తాయని నేతల నుంచి జరుగుతున్న ప్రచారంతో కేడర్‌లో సరికొత్త జోష్ నెలకొంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థల పదవులపై ఉమ్మడి జిల్లాకు చెందిన నాయకులు, కార్యకర్తలు కొండంత ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఖమ్మం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ప్రతీసారి అదిగో ఎన్నికలు.. ఇవిగో ఎన్నికలంటూ మంత్రుల నుంచి ప్రకటనలు రావడం, కేడర్ ఆశగా చూడడం, నిరాశ చెందడం పరిపాటిగా మారింది. అయితే బీసీ రిజర్వేషన్ బిల్లు 42శాతం పెంపు ఇప్పట్లో తేలే పరిస్థితి కనిపించకపోవడంతో.. వచ్చే సెప్టెంబరు మొదటి వారంలో ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉంటుందని జోరుగా ప్రచారం నడుస్తోంది. అలాగే ఈలోగా నామినేటెడ్ పదవులను భర్తీ చేసే అవకాశం కనిపిస్తుండడంతో కాంగ్రెస్ కేడర్‌లో ఈసారైనా పదవులు దక్కుతాయా!? లేదా!? అన్న కొండంత ఆశతో పాటు కాస్త భయమూ నెలకొంది. ఎన్నికలు నిర్వహిస్తే ఖమ్మం జిల్లాలో జడ్పీటీసీలు 20, ఎంపీపీలు 20, ఎంపీటీసీలు 283, సర్పంచ్‌లు 571, వార్డు సభ్యులు 5214 ఉన్నాయి. దీనికి తోడు మధిర సత్తుపల్లి, వైరా, ఏదులాపురం, కల్లూరు, మునిసిపాలిటీ చైర్మన్ పదవులు, కౌన్సిలర్ పదవులు కూడా ఎన్నికల ద్వారా కేడర్‌కు దక్కనున్నాయి. ఖమ్మం కార్పొరేషన్‌కు ఇంకా గడువు ఉండడంతో ఇప్పట్లో ఎన్నికలు ఉండవు. అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 478 పంచాయతీలు, 4232 వార్డులుండగా.. కొత్తగూడెం కార్పొరేషన్‌తో పాటు ఇల్లెందు, అశ్వారావుపేట మునిసిపాలిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. వీటితోపాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 22 జడ్పీటీసీలు, 22 ఎంపీపీలు, 233 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే ఎన్నికల ఏర్పాటుకు సంబంధించి అధికారులు ఓటరు జాబితాను సిద్ధం చేశారు. పంచాయతీ ఎన్నికలకు బ్యాలెట్ నమూనాలు, సర్పంచ్, వార్డు సభ్యుల గుర్తులు కూడా సిద్ధం చేసి ఉంచారు. మరోవైపు నియాయక పదవులకు సంబంధించి ఆశలు చిగురిస్తున్నాయి. భద్రాచలం , జమలాపురం దేవస్థానాల పాలక వర్గాలతో పాటు స్తంబాద్రి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంతో పాటు ఖమ్మం సుడా వంటి కీలక పదవుల నియామకం జరగాల్సి ఉంది. అలాగే జిల్లాలోని మరికొన్ని దేవాలయ కమిటీల పదవులతో పాటు రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్ చైర్మన్ పదవులను ఉమ్మడి జిల్లా నేతలు ఆశిస్తున్నారు. మొత్తమ్మీద ఓవైపు స్థానిక సంస్థల ఎన్నికలు, మరోవైపు నామినేటెడ్ పదవులు జరుగుతున్నాయన్న విషయంతో కేడర్‌లో ఆశలు చిగురిస్తున్నాయి.

కేటీఆర్ భద్రాద్రి జిల్లా పర్యటన ఖరారు!

- 10, 11 తేదీల్లో కొత్తగూడెం, భద్రాచలంలో సభలు
- కేటీఆర్‌తో భేటీలో జిల్లా నాయకులకు సమాచారం



కేటీఆర్‌తో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా

భద్రాచలం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు భద్రాద్రి జిల్లా పర్యటన ఖరారైంది. కేటీఆర్‌ను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదివారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సమయంలో కేటీఆర్ భద్రాద్రి జిల్లా పర్యటనపై చర్చించారు. సెప్టెంబరు 10, 11వ తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కేటీఆర్ పర్యటన ఉండనున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. 10న కొత్తగూడెంలో, 11న భద్రాచలంలో సభలు ఉంటాయని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. జిల్లాలోని బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్తేజం నింపేందుకు ఈ సభలు ఎంతగానో దోహదపడతాయని వారు భావిస్తున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని పార్టీ నాయకులను, కేడర్‌ను సమాయత్తం చేసేందుకు సైతం ఈ పర్యటన ఉపకరిస్తుందని నేతలు ఆశాభావంతో ఉన్నారు. గతంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో భద్రాచలం బీఆర్ఎస్ అభ్యర్థి తరఫున ప్రచారం కోసం వచ్చిన కేటీఆర్.. మరోసారి భద్రాచలానికి వస్తుండడంతో ఆ పార్టీ నాయకులు తమ సత్తా చాటేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. రాష్ట్రంలో ప్రధాన పతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ జిల్లాలో సైతం పట్టు సాధించేందుకు ఈ పర్యటన ఎంతగానో ఉపయోగపడుతుందని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఎదురు చూపులు!

- బదిలీల కోసం వేచి చూస్తున్న సింగరేణి కార్మికులు
- 8 నెలలుగా బదిలీలు నిలిపివేసిన యాజమాన్యం
- ఉద్యమాలకు సిద్ధమవుతున్న కార్మిక సంఘాలు
- తక్షణమే తమ డిమాండ్లు నెరవేర్చాలని డిమాండ్



సింగరేణి ప్రధాన కార్యాలయం

కొత్తగూడెం టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి కార్మికులు బదిలీల కోసం నెలల తరబడి ఎదురు చూస్తున్నారు. సింగరేణి యాజమాన్యం జనవరి నుంచి జూన్ నెల వరకు ఉత్పత్తి మాసాలు ఉండడంతో.. కార్మికుల బదిలీలపై నిషేధం విధించింది. ప్రతీ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు బదిలీలను నిలిపివేస్తున్న యాజమాన్యం.. ఈసారి మరో రెండు నెలలు అదనంగా బదిలీలపై ఆంక్షలు విధించింది. జూన్ నెల పూర్తయినప్పటికీ.. బదిలీలు కాకపోవడం వల్ల కార్మికులు సింగరేణి వ్యాప్తంగా ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో సింగరేణిలో కార్మికుల బదిలీలతో పాటు ఈ ఏడాది వచ్చిన లాభాలను కార్మికులకు అందించాలని, సొంతింటి కలను నెరవేర్చేందుకు చర్యలు చేపట్టాలని, కార్మికులకు ఆదాయపు పన్నును రద్దు చేయాలని, మెడికల్ బోర్డును ఏర్పాటు చేసి కారుణ్య నియామకాల ద్వారా కార్మికుల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సింగరేణిలోని ప్రధాన కార్మిక సంఘాలన్నీ ఉద్యమాలకు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, బీఎంఎస్‌లు దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తుండగా.. కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ (సీఎంఓఏ) ఆధ్వర్యంలో సైతం తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలంటూ.. సింగరేణిలో పని చేస్తున్న సుమారు 2400 మంది ఉద్యోగులు గత వారం రోజులుగా నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రధాన కార్మిక సంఘాలతో పాటు విప్లవ కార్మిక సంఘాలు సైతం కార్మికుల సమస్యలపై పోరాటాలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది. తెలంగాణ రాష్ట్రంలోని అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి ఆరు జిల్లాల్లో విస్తరించి.. 42వేల మంది కార్మికులు వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. అధిక శాతం మంది కార్మికులు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్మిక సంఘాల నాయకులను కలుస్తూ వారి ద్వారా తమను బదిలీ చేయాలంటూ (మిగతా 6వ పేజీలో)

రాజీవ్ స్వగృహ జలజ టౌన్‌షిప్ ప్రాజెక్టు విక్రయం

- ఉద్యోగ, సహకార సంఘాలు, స్వచ్ఛంద సంస్థలకు చక్కటి అవకాశం
- మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో...

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం ఏదులాపురం మునిసిపాలిటీ పోలేపల్లిలో అసంపూర్తిగా ఉన్న రాజీవ్ స్వగృహ ప్రాజెక్టును ఉన్నది ఉన్నట్లుగా విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వివిధ సంస్థల్లో పని చేసే ఉద్యోగులకు మేలు చేకూర్చాలన్న లక్ష్యంతో ఈ జలజ టౌన్‌షిప్ పేరుతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. నిర్మాణానికి అయిన ఖర్చుతోనే ఈ బహుళఅంతస్తుల సముదాయంతో ఉన్న ప్రాజెక్టు మొత్తాన్ని లాటరీ ద్వారా కేటాయించనున్నారు. వివిధ సహకార సంఘాలు, ఉద్యోగ సంఘాలు, బిల్డర్లు, డెవలపర్లు, జాయింట్ వెంచర్లు ఇలా గ్రూప్ హౌసింగ్ పథకాలపై ఆసక్తి ఉన్నవారు ఎవరైనా ఇందుకోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ జూలై 22న నోటిఫికేషన్ విడుదల చేశారు. సెప్టెంబరు 8న లాటరీ విధానంలో కేటాయించనున్నారు. దీంతో ఈ ప్రాజెక్టును గురించి తెలుసుకునేందుకు పలుసంఘాల ప్రతినిధులు ఇతరులు అనేక మంది వస్తున్నారు. సుమారు 9.22 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టులో నాణ్యతా ప్రమాణాలతో నిర్మించిన ఎనిమిది బ్లాక్లులు, తొమ్మిది ఫ్లోర్లు ఉన్నాయి. ఒక్కో ఫ్లోర్‌లో 8ప్లాట్లతో ప్రాజెక్టు మొత్తం మీద 576 ఫ్లాట్లు ఉన్నాయి.వీటి పనులు వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్నాయి. ప్రాజెక్టు కోసం ప్రత్యేకంగా 60అడుగుల అప్రోచ్ రోడ్డు మంజూరై పనులు కొనసాగుతుండటమే కాకుండా, మున్నేరు నదికి సమీపంలో ఉండటం ప్రత్యేక ఆకర్షణతో కూడిన ఆహ్లాదకరమైన వాతావరణం ప్రాజెక్టు ప్రత్యేకతలని అధికారులు వివరించారు. మంచి వసతులతో మధ్యతరగతి ప్రజలకు, ముఖ్యంగా వివిధ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు మేలు చేకూర్చాలన్న లక్ష్యంతో, నిర్మాణానికి అయిన ఖర్చును మాత్రమే పరిగణనలోనికి తీసుకుంటూ చదరపు అడుగు ధరను రూ.1150 మాత్రమే నిర్ణయించామని రాజీవ్ స్వగృహ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతం తెలిపారు. ఖమ్మం నగరానికి పశ్చిమవైపున్న ప్రాంతం అభివృద్ధి చెందుతున్నదనీ, అంతే కాకుండా కొత్తగా ఏదులాపురం మునిసిపాలిటీగా మారడంతో, పురోభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఖమ్మంలోని వివిధ ఉద్యోగ సంఘాలు, సహకార సంఘాలు, ఇతరత్రా స్వచ్ఛంధ సంస్థలు ప్రభుత్వం నామమాత్రపు ధరతోనే అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ టౌన్‌షిప్‌లో మౌలిక వసతుల కల్పన కూడా జరుగుతుందని స్పష్టం చేశారు. ఇక్కడి భూములు, నిర్మించిన భవనాలపై ఎటువంటి అపోహలు వద్దని మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతం పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి పూర్తి పారదర్శకంగా లాటరీ ద్వారానే కేటాయింపులు చేస్తామన్నారు.

సెప్టెంబరు 1న పెన్షన్ విద్రోహదినం

విజయవంతం చేయాలి : టీజీవో అధ్యక్షుడు కస్తాల


సమావేశమైన టీజీవో కార్యవర్గం

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబర్ ఒకటవ తారీఖున పెన్షన్ విద్రోహ దినాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కస్తాల సత్యనారాయణ తెలిపారు. దీనిలో భాగంగా జిల్లా కలెక్టరేట్ ఎదుట ఉదయం 10 గంటలకు నల్ల బ్యాడ్జీలు నల్లడ్రస్సులతో నిరసన కార్యక్రమాలను నిర్వహించాలని, అనంతరం హైదరాబాదులో పబ్లిక్ గార్డెన్లో జరిగే కార్యక్రమానికి జిల్లా నుండి పెద్ద ఎత్తున గెజిటెడ్ అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో టీజీవో జిల్లా సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 18న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జరిగే బస్సు యాత్రలులో ఉద్యోగులు పాల్గొనాలన్నారు. ఈ నెలలో టీజీవో జిల్లా అధ్యక్షులు కస్తాల సత్యనారాయణ, కార్యవర్గ సభ్యుల పదవీ విరమణపైనా చర్చించారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో కార్యదర్శి మోదుగు వేలాద్రి, జిల్లా కార్యవర్గ సభ్యులు వాసిరెడ్డి శ్రీనివాస్ , ట్రెజరర్ కొండపల్లి శేష ప్రసాద్, టీజీవో హౌస్ బిల్డింగ్ సొసైటీ సెక్రెటరీ డాక్టర్ పి విజయ్ కుమార్, మహిళా అధ్యక్షురాలు ఉషశ్రీ, కార్యవర్గ సభ్యులు మల్లెల రవీంద్ర ప్రసాద్, పుష్పరాజ్, వై మంజుల, తమ్మిశెట్టి శ్రీనివాస్, గోపాలకృష్ణ, కనపర్తి వెంకటేశ్వర్లు, జి రమేష్, మోదుగు వెంకటేశ్వర్లు, తాజుద్దీన్, చంద్రకళ, ఎస్ నరేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

తగ్గుతున్న గోదావరి నీటిమట్టం

భద్రాచలం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమేపి తగ్గుతోంది. శనివారం అర్ధరాత్రి 12 గంటలకు 35 అడుగులున్న గోదావరి నీటిమట్టం ఆదివారం ఉదయం 6 గంటలకు 34.1 అడుగుకు తగ్గింది. 9 గంటలకు 33.4, 12 గంటలకు 33 అడుగులు, 3 గంటలకు 32.6 అడుగులు, 6 గంటలకు 32 అడుగులకు తగ్గింది. రాబోయే 24 గంటల్లో గోదావరి నీటిమట్టం మరింతగా తగ్గే అవకాశాలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. గోదావరి స్నానఘట్టాల వద్ద ఒండ్రుమట్టితో కూడిన బురదను సిబ్బంది తొలగిస్తున్నారు.

రామయ్యకు అభిషేకం, స్వర్ణ పుష్పార్చన


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామ చంద్రస్వామి వారికి ఆదివారం ఆర్జిత సేవలో భాగంగా స్వామి వారికి అంతరాలయంలో ప్రత్యేక అభిషేకం, స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. ఈ సేవల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే నిత్యకల్యాణ వేదిక వద్ద స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, వేద ఆశీర్వచనం వైదిక సిబ్బంది నిర్వహించారు.

నీటి నిల్వలపై ఇక ఆయిల్ బాల్స్


ఆయిల్ బాల్స్ తయారు చేస్తున్న ఎస్‌హెచ్‌జీ మహిళా సభ్యులు

- మెప్మా ఆధ్వర్యంలో 50వేల ఆయిల్ బాల్స్ సిద్ధం
- మహిళా సంఘాలకు రూ.లక్ష వరకు ఉపాధి

ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నీటి నిల్వలో ఉండే దోమల లార్వాను లాగేసేందుకు ఆయిల్ బాల్స్ సిద్ధమయ్యాయి. ఖమ్మం నగరంలో ఖాళీ స్థలాలు పెద్ద సమస్యగా మారాయి. వర్షం పడిందంటే ఖాళీ స్థలాల్లో నీరు చేరుతోంది. దోమల లార్వాకు కేంద్రాలుగా మారుతున్నాయి. ఖాళీ స్థలాల యజమానుల వివరాలు తెలియక కేఎంసీ అధికారులు జరిమానా విధించలేని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఖాళీ స్థలాల్లోని నీటి నిల్వలు ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేసేందుకు కార్యాచరణ చేసి సిద్ధం చేయించారు.

మెప్మా ఆధ్వర్యంలో 50 వేల ఆయిల్ బాల్స్

ఆయిల్ బాల్స్ తయారీతో పాటుగా మహిళా స్వయం సహాయక సంఘాలకు ఉపాధి కల్పించాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య కార్యాచరణ చేశారు. ఖమ్మం నగరానికి తొలి విడతగా 50వేల ఆయిల్ బాల్స్ అవసరం ఉందని గుర్తించారు. ఖమ్మం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ విభాగానికి బాధ్యతలు కేటాయించారు. ఒక్కో ఆయిల్ బాల్ తయారీకి రూ.2 కేటాయించారు. ఇలా 50వేల ఆయల్ బాల్స్ తయారు చేయటం ద్వారా మెప్మాలోని పది మంది మహిళలకు ఉపాధి దక్కింది. రూ.లక్ష వరకు పదిమంది సభ్యులకు పనులు దక్కాయి. మరోపక్క నాణ్యంగా ఆయిల్ బాల్స్ తయారు జరిగిందని అధికారులు పేర్కొంటున్నారు.

ఆర్టీసీ కార్గోలో మాయాజాలం

- పార్శిల్ వస్తువులు ఇవ్వకుండానే, ఇచ్చినట్టు మెసేజ్‌లు
- వినియోగదారులను రోజుల తరబడి తిప్పుతున్న సిబ్బంది


ఖమ్మం నగరంలోని నూతన బస్టాండ్‌లోని కార్గో సెంటర్

ఖమ్మం ఖానాపురంహవేలి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నూతనబస్టాండ్‌లోని ఆర్టీసీ కార్గో సెంటర్‌లో సిబ్బంది కారణంగా పార్శిల్స్ బుక్ చేసిన కొందరు వినియోగదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత కొంత కాలంగా ఆర్టీసీ కార్గోలో బుక్ చేసిన వస్తువులు వినియోగదారుడికి ఇవ్వకుండానే ఇచ్చినట్లు మొబైల్‌కు మెస్సేజ్‌లు పంపిస్తున్న తీరుతో వినియోగదారులు భయాందోళనకు గురికావాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కొన్ని విలువైన వస్తువులను సైతం ఆర్టీసీ కార్గో ద్వారా బుక్ చేసి ధైర్యంగా ఉంటున్న వినియోగదారులకు ఖమ్మం ఆర్టీసీలో కొంత మంది కార్గో సిబ్బంది తీరుతో ఇబ్బందులు తప్పడంలేదు. వివిధ ప్రాంతాల నుంచి ఖమ్మం చేరుకున్న పార్శిల్స్‌ను భద్రపర్చాల్సిన సిబ్బంది వారి నిర్లక్ష్యం కారణంగా ఎన్నో వస్తువులు కానరాకుండా పోతున్న సంఘటనలు గత కొంత కాలంగా వెలుగులోకి వస్తున్నాయి. ఖమ్మం నగరానికి చెందిన ఓ వ్యక్తి ఈ నెల 6న హన్మకొండ నుంచి ఖమ్మానికి ఓ పార్శిల్ బుక్ చేసుకున్నా డు. కాని అతనికి ఈ పార్శిల్ ఇవ్వకుండానే ఇచ్చినట్లు ఆగస్టు 13న ఫోన్‌కు మెస్సేజ్ పంపిన కార్గో సిబ్బంది. వాస్తవానికి పార్శిల్ బుక్ చేసుకున్న 24 గంటలలలోపే ఖమ్మం చేరుకున్న పార్శిల్ వినియోగ దారుడుకి మాత్రం నేటికి చేరలేదు. అదే పార్శిల్ వచ్చి రోజుల తరబడి తీసుకెళ్లని వినియోగదారులపై అపరాధ రుసుం చెల్లిస్తేనే వస్తువులు ఇచ్చే కార్గో సిబ్బంది, వినియోగదారులకు పార్శిల్ ఇవ్వకుండా రోజుల తరబడి తిప్పుతున్నా.. పట్టించుకోని ఆర్టీసీ అధికారులు. ఆగస్టు 8వ తేదీ నుంచి నేటి వరకు రోజు సంబంధిత వినియోగదారుడు ఖమ్మం కార్గో సెంటర్‌కు వచ్చి పార్శిల్ అడుగుతున్నా.. సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ రేపు రా, మాపు రా అంటూ రోజుల తరబడి తిప్పుతున్నారు. ఇలా ఈ ఒక్క వినియోగదారుడే కాదు జిల్లాలో చాలా మంది వినియోగదారులకు పార్శిల్స్ ఇవ్వకుండానే ఇచ్చినట్లు మెసేజ్‌లు పంపుతున్న కార్గో సిబ్బంది. గతంలో మహబూబ్‌నగర్‌లో జిల్లా కేంద్రంలోని కార్గో సెంటర్‌లో మొబైల్స్ మాయం అయినట్లు ఖమ్మంలో కూడా ఏమైన వస్తువులను మాయం చేస్తున్నారా అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఇలా మాయం చేసిన వస్తువులనే వేలం నిర్వహిస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్టీసీ కార్గోపై ఎంతో నమ్మకంతో ఉన్న వినియోగదారులకు ఇలాంటి సంఘటనలతో విలువైన వస్తువులను పంపాలంటే భయపడాల్సి వస్తుందని కొందరు వినియోగదారులు వాపోతున్నారు. బస్సులలో వచ్చిన కార్గో పార్శిల్స్ కొందరు కార్మికులు బస్సుపై నుంచి కిందకు ఎత్తివేస్తుండటంతో కొన్ని వస్తువులు పగిలిపోతున్నాయని, మరి కొన్ని వస్తువులకు గీతలు పడుతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. వర్షాకాలం పార్శిల్స్‌ను తడవ కుండా చూడాల్సిన సిబ్బంది మాకేం సంబంధం లేదనే ధోరణితో పార్శిల్స్‌ను బయట పడేస్తున్నారు. వర్షం వచ్చినప్పుడు ఆ పార్శిల్స్ తడుస్తున్నా పట్టించు కోని సిబ్బంది. గతంలో ఇలా ఎన్నో విలువైన వస్తువులు తడిసి పనికిరాకుండా పోయిన సంఘటనలు ఉన్నాయి. అయినా సిబ్బంది మారని పరిస్థితి. ఇకనైనా సంబంధిత వినియోగదారుడి పార్శిల్‌ను వెంటనే ఇచ్చి మరలా ఇటువంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చూడాల్సిన బాధ్యత ఆర్టీసీ అధికారులపై, సిబ్బందిపై ఎంతనా ఉందని వినియోగదారులు కోరుతున్నారు.



పెసర రైతుల పరేషాన్

- మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాల కోసం ఎదురుచూపు
- మంత్రి తుమ్మల చొరవ చూపాలని రైతుల వేడుకోలు

వైరా, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఈ ఖరీఫ్ సీజన్‌లో పెసర సాగు చేసిన రైతులపై ప్రకృతి కన్నెర్రజేసింది. దానికి తోడు అరకొరగా రైతు చేతికొచ్చిన పంటను విక్రయించుకునే దశలో ఒక్కసారి బహిరంగ మార్కెట్లో ధర అమాంతం పడిపోయింది. దాంతో పెసర రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అయినప్పటికీ మార్క్‌ఫెడ్ ఇంతవరకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఎలాంటి ప్రణాళిక సిద్ధం చేయలేదు. ఇది ప్రైవేట్ వ్యాపారులకు అందివచ్చిన అవకాశంగా మారింది.

ఈ ఏడాది ఖమ్మంజిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 18,194 ఎకరాల్లో పెసర పంట సాగు చేశారు. సీజన్ మొదట్లో పెసర పంట ఎంతో ఆశాజనకంగా ఉంది. ఎకరాకు ఆరేడు క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు ఆశపడ్డారు. తీరా పూత, పిందె, కాయ తయారైన తర్వాత ఈనెలలో ఎడతెరపి లేకుండా 15 రోజులు వర్షాలు కురవడంతో రైతుల ఆశలు ఆవిరయ్యాయి.ఇ కోత దశకు వచ్చిన పెసర కాయ మొత్తం వర్షాలకు దెబ్బతిన్నది. మిగిలిన పెసలు కాయదశలోనే రంగు మారాయి. దిగుబడి కాస్తా రెండు క్వింటాళ్లకు పడిపోయింది. అయినప్పటికీ రైతులు పంటను భూమి పైన వదిలేయలేక యంత్రాలతో కోయిస్తున్నారు. ఇదే సమయంలో ఒక్కసారిగా పెసల ధరలు ఆసాంతం పడిపోయాయి. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర క్వింటా ఒక్కింటికి రూ.8వేలకుపైగా ఉండగా బహిరంగ మార్కెట్లో ఆధర రూ.ఐదు వేలకు పడిపోయింది. అరకొరగా వచ్చిన పెసలు రంగు మారడంతో అమ్ముకోవడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. రైతుల కష్టాలు, కన్నీళ్లను ప్రైవేట్ వ్యాపారులు సొమ్ము చేసుకొనేందుకు ఒక్కసారిగా రేట్లు తగ్గించి వేశారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వ ఆధీనంలోని మార్క్‌ఫెడ్ అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఎకరం ఒక్కింటికి వచ్చిన ఒకట్రెండు క్వింటాళ్ల పెసలను తక్కువ ధరలకే ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించుకోవాల్సి వస్తుండటం తమ దౌర్భాగ్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మార్క్‌ఫెడ్ అధికారులకు రైతుల ప్రయోజనాలు పట్టవా అని నిలదీస్తున్నారు. మంత్రి తుమ్మల వెంటనే తగు చర్యలు తీసుకొని మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పెసర కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయించాలని రైతులు కోరుతున్నారు.

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

(5వ పేజీ తరువాయి)

సరైన గుర్తింపు ఉంటుందన్నారు. విడతల వారీగా అర్హత కలిగిన వారందరికీ మంజూరు చేస్తామని తెలిపారు. ఇప్పటికే ఇళ్ల పట్టాలు పొందినవారు ఇళ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. అలాగే అభివృద్ధి పనులను నాణ్యతగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్థానికంగా పాఠశాల నిర్మాణానికి కావాల్సిన స్థల పరిశీలన పూర్తి చేయాలన్నారు. వర్షాకాలం తర్వాత పనులను ప్రారంభించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు, సీఎం రిలీఫ్ ఫండ్స్, కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులు, రేషన్‌కార్డుల పత్రాలను లబ్ధిదారుల నివాసాలకు వెళ్లి పంపిణీ చేయాలని సూచించారు. అనంతరం ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ.. పేదల అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పని చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోకు మించిన స్థాయిలో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఇండోర్‌లో చూసిన పారిశుధ్య పనులను ఖమ్మంలోనూ అమలు జరిగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రఫీదాబేగం, మాజీ ఎమ్మెల్సీ బాలసాని, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, కేఎంసీ ఈఈ రంజిత్, వార్డు ఆఫీసర్ సందీప్ పాల్గొన్నారు.

ఎడాపెడా గర్భాశయ కోతలు!

(5వ పేజీ తరువాయి)

తొలగించడం వైద్య వ్యవస్థలోని అవలక్షణమని, అశాస్త్రీయమని నిపుణులు స్పష్టంచేస్తున్నారు.

ఎందుకీ ప్రాధాన్యత...!

గర్భసంచి, అండాశయాలు, అండవాహికలు ఈ మూడే పునరుత్పత్తి వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తాయి. కీలకమైన ఈస్ట్రోజన్ సహా ఇక్కడ ఉత్పత్తి అయ్యే హార్మోన్లు శరీరంలో జీవక్రియలు సక్రమంగా జరిగేలా చేస్తాయి. మెదడు, గుండె పనితీరుతో పాటు, ఎముక గట్టితనం, రక్తపోటు నియంత్రణ, పోషకాల శోషణ, జీవక్రియల క్రమబద్ధీకరణ వంటివి ఈ హార్మోన్లు చేస్తాయి. ఈ కారణంగానే 50 ఏళ్లలోపు మహిళల్లో బీపీ, షుగర్ బాధితులు పురుషుల కంటే తక్కువగా ఉంటారు.

తొలగించడం వలన నష్టాలు.... ఇలా?

అండాశయానికి రక్త సరఫరాలో మార్పులు చోటుచేసుకుంటాయి. ఈస్ట్రోజన్ హార్మోన్ ఉత్పత్తి ఆగిపోతుంది. ఆ దుష్ప్రభావం అన్ని అవయవాల పనితీరుపైనా పడుతుంది. గర్భసంచిని తొలగించిన తర్వాత 33 శాతం స్త్రీలలో అండాశయాల పనితీరు కూడా తగ్గుతుందంటున్నారు వైద్యులు. ఎముకల్లో కాల్షియం నిల్వలు చేరక పెళుసుబారిపోతాయి.

జిల్లాలో క్రికెట్ అభివృద్ధే ధ్యేయం

ద న్యూ ఖమ్మం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మం స్పోర్ట్స్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్రికెట్ క్రీడాభివృద్ధే తమ ధ్యేయమని ద న్యూ ఖమ్మం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ ఎండీ మసూద్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భావిక్రీడాకారుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఖమ్మం నగర శివారులో కూసుమంచి మండలం జీళ్లచెరువు వద్ద 14 ఎకరాల విస్తీర్ణంలో రెండు అధునాతన క్రికెట్ స్టేడియాలు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో క్రికెట్‌ను బతికించాలనే పట్టుదలతో తమ సంఘం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఇటీవల కొంతమంది తమ క్రీడా స్ఫూర్తిని విస్మరించేలా బురద జల్లుతున్నారని, అవినీతికి పాల్పడినట్లు మాట్లాడుతున్నారని వాపోయారు. లేనిపోని అభియోగాలు, నిందలు వేస్తుండటం బాధాకరమన్నారు. జిల్లాలో 15 ఏళ్లుగా తాను క్రికెట్ వ్యాప్తికి ఏం చేశానో సీనియర్ క్రికెటర్లను, కోచ్‌లను అడిగితే తెలుస్తుందన్నారు. తమపై ఆరోపణలు చేసేవారు ఎక్కడికి రమ్మంటే అక్కడకు వస్తామని, అవసరమైతే న్యాయ పోరాటానికి సైతం సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. త్వరలో ప్రారంభించే తమ నూతన స్టేడియాలలో ఇతర రాష్ట్రాలు, గ్రామీణ ప్రాంతాల పిల్లలు అక్కడే ఉండి నిత్యం నిపుణులైన కోచ్‌ల సారథ్యంలో 10 నెట్స్‌లలో ఒకేసారి సాధనతో పాటు మరొక స్టేడియంలో నిరంతర క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించే విధంగా ప్రణాళికలు రచించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ద న్యూ ఖమ్మం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బుర్రి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఖాసీంపాషా, మేనేజర్ ఫారూఖ్,కోచ్‌లు విజయ్, దివ్యప్రకాశ్, సందీప్, దుర్గ, శివ, ఆసిఫ్ క్రీడాకారులు వారి తల్లిదండ్రులు ఉన్నారు.

సత్తుపల్లికి తరలుతున్న 'గిరిజన' పాఠశాల

- గతంలో విద్యార్థినుల అస్వస్థత ఘటనలతో తరలింపు
- సమస్యలకు పరిష్కారం చూపకుండానే...
- పాఠశాల తరలింపుపై సర్వత్రా నిరసన
- విద్యకు దూరమవుతున్న కల్లూరు గిరిజన విద్యార్థినులు
- ఐటీడీఏ పీవో ఆదేశాలు జారీ



తరలించనున్న కల్లూరు గిరిజన ఆశ్రమ పాఠశాల

కల్లూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినిల వరస అస్వస్థత ఘటనలపై, వసతి సౌకర్యాలు కొరవడినాయన్న సాకుతో పాఠశాలను ఇక్కడ నుంచి సత్తుపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలకు తరలింపునకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ఈ మేరకు జిల్లా గిరిజన సంక్షేమ అధికారికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆదివారం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి విజయలక్ష్మీ ఈ ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ పాఠశాలను సత్తుపల్లికి తరలింపుపై విద్యార్థినిల తల్లిదండ్రులను పిలిపించి సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో పాఠశాల తరలింపు విషయాన్ని స్పష్టం చేశారు. ఈ పాఠశాలలో వసతి సౌకర్యాలు సక్రమంగా లేనందున ఇక్కడ నుంచి సత్తుపల్లికి తరంపునకు సిద్ధమైనామని గిరిజన సంక్షేమ శాఖ డీడీ విజయలక్ష్మీ విలేకరులతో మాట్లాడతూ సదరు విషయాన్ని కూడా స్పష్టం చేశారు.

సమస్యలను పరిష్కరించకుండా.. పాఠశాల తరలింపుపై సర్వత్రా నిరసన

కల్లూరులోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఈ నెలలో వరుసగా రెండు దఫాలుగా అల్పాహారం తిని విద్యార్థినిలు అస్వస్థతకు గురియైనారు. ఈ సంఘటనతో బెంబెలెత్తిన ఉన్నత అధికారులు సమస్యకు పరిష్కార మార్గం చూపకుండా ఇక్కడ నుంచి పాఠశాలను ఏకపక్షంగా సత్తుపల్లికి తరలింపుపై సర్వాత్ర విద్యార్థి సంఘాల్లో, గిరిజన సంఘాల, పలు రాజకీయ పక్షాల్లో సర్వత్ర నిరసన వ్యక్తమవుతుంది. ఈ పాఠశాల కల్లూరులో ఏర్పాటై 25 సంత్సరాలు కావస్తుంది. నాటి నుంచి నేటి వరకు ఎంతో మంది గిరిజన పేద విద్యార్థినిలు విద్యను ఇక్కడ అభ్యసించారు. ఈ ఏడాది విద్యాసంత్సరంలో ఆగస్టు నెలలో వరుసగా రెండు సార్లు అల్పాహారం తిని విద్యార్థినిలు అస్వస్థతకు గురియైన విషయం విదితమే. ఈ సంఘటనపై పూర్తిస్థాయిలో ప్రభుత్వం తరుపున ఉన్నత అధికార యంత్రాంగం అసలు సమస్యలను పరిష్కార మార్గం చూపుకుండా ఏకపక్షంగా కల్లూరు నుంచి సత్తుపల్లికి ఈ పాఠశాలను తరలించటం ఎంతవరకు సమర్ధనీయమని ఉన్నత అధికారులను పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ సుమారు ఆరు ఏకరాల స్థలంలో ఈ పాఠశాలతో అనుసంధానంగా వసతి గృహం కొనసాగుతుంది. కల్లూరు పరిసర ప్రాంతాల నుంచే కాక గిరిజన ప్రాంతాలైన పెనుబల్లి, ఏన్కూరు, జూలూరుపాడు తదితర మండలాల నుంచి ఈ పాఠశాలలో చేరి చదువుకుంటున్నారు. దీంతో ఏంతో మంది గిరిజన విద్యార్థినీలు లబ్దిపొందుతున్నారు. ఆకస్మాత్తుగా పాఠశాలను ఇక్కడ నుంచి సత్తుపల్లికి తరలిపు నిర్ణయంపై విద్యార్థినీల తల్లిదండ్రులు గందర గోళానికి గురియైతున్నారు. విద్యార్థినిల అస్వస్థత సంఘటనలపై ఇటీవల వార్డెన్ సస్పెండ్ చేయటంతో పాటుగా ఇద్దరు వంట సిబ్బందిపై కూడా బదిలీ వేటు పడిన విషయం విదితమే. ఈ సందర్భంగా గత గురువారం పాఠశాలను ఐటీడీఏ పీవో రాహుల్ సందర్శించారు. విద్యార్థినిలకు నాణ్యమైన భోజనం అందించాలని, వసతుల కల్పనపై రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు కూడా స్పష్టం చేశారు. ఇంత వరకు బాగానే ఉంది. అకస్మాత్తుగా ఈ పాఠశాలను తరలింపుపై ఉన్నత అధికారులు తీసుకున్న నిర్ణయం పట్ల సర్వాత్ర విమర్శలకు దారితీస్తుంది. ఈ పాఠశాలను ఇక్కడ నుంచి తరలించటంతో ఈ ప్రాంత గిరిజన విద్యార్థినిలు అన్యాయానికి గురవుతున్నారని గిరిజన సంక్షేమ జిల్లా అధికారిని ఆంధ్రజ్యోతి ప్రశ్నించగా తమపై అధికారుల నిర్ణయం అని సమాధానం చెప్తూ మాట దాట వేశారు.

పాఠశాల తరలింపు తగదు

కల్లూరులోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలను ఇక్కడ నుంచి తరలించటం తగదని లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ధర్మసోతు దశరథనాయక్, గిరిజన నాయకుడు ధరావత్ మోహన్ నాయక్, సీపీఎం, సీపీఐ మండల నాయకులు తన్నీరు కృష్ణార్జునరావు, దామాల దయాకర్‌లు అన్నారు. గత 25 సంత్సరాల క్రితం నుంచి ఈ పాఠశాల ఇక్కడ కొనసాగుతుందని, దీంతో గిరిజన పేద విద్యార్థినిలు ఇక్కడ చదువుకొని లబ్ధిపొందుతున్నారన్నారు. ఈ పాఠశాలను ఉన్నత అధికారులు ఏకపక్షంగా తరలించటం సరియైన నిర్ణయం కాదన్నారు. ఇప్పటికైన అధికారులు పునఃపరిశీలన చేసి యధావిధిగా కల్లూరులోనే గిరిజన ఆశ్రమ పాఠశాల కొనసాగేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఆందోళన బాటలో విద్యార్థి సంఘాలు

కల్లూరులోని గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలను కల్లూరు నుంచి సత్తుపల్లికి తరలింపు అభ్యంతరం వ్యక్తం చేస్తూ సోమవారం ఆందోళన బాటకు సిద్ధమవుతున్నారని తెలిసింది. కల్లూరు రెవెన్యూ డివిజన్ కేంద్రంతో పాటుగా మునిసిపాలిటీగా రూపాంతరం చెందగా, ఇక్కడ నుంచి ఈ పాఠశాలను తరలించటం సరియైన నిర్ణయం కాదని పలు విద్యార్థి సంఘాల నాయకులు భావిస్తున్నారు. దీంతో ఆందోళన బాటకు సిద్ధమవుతున్నారు.

ప్రముఖ కవి మాల్యశ్రీకి భోగోజు సముద్రమ్మ-పురుషోత్తం

స్మారక పురస్కారం ప్రదానం

- కథల, కవితల సంకలనాలు ఆవిష్కరణ
- బాల కథలకు, కవులకు, విజేతలకు
- నగదు పురస్కారాల అందజేత


కథల, కవితల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

ఖమ్మం ఖానాపురంహవేలి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలోని ప్రముఖ సాహిత్య సంస్థ పురిమళ్ల ఫౌండేషన్ 7వ వార్షికోత్సవ మహోత్సవం ఆదివారం నగరంలోని మంచి కంటి మీటింగ్ హాల్‌లో నిర్వహించారు. నామా పురుషోత్తం అధ్యక్షతన జరిగిన సభలో అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిం చిన పోటీల్లో బహుమతులకు ఎంపికైన కథల, కవితల పుస్త కాన్ని, బాల కవులు రాసిన కథలు, కవితలతో రూపొందిన సంకలనాన్ని అతిథులు ఆవిష్కరించారు. తొలుత ముఖ్య అతి థి, ప్రముఖ కవి మువ్వా శ్రీనివాసరావు మాట్లాడుతూ పురిమళ్ల సునంద చేస్తున్న సాహిత్య సేవ అభినందనీయమ ని, అద్వితీయమని పేర్కొన్నారు. ఏడేళ్లుగా అనేక కార్యక్రమా లు నిర్వహిస్తూ వర్ధమాన రచయితలతో పాటు, బాల కవుల ను, కథకులనూ ప్రోత్సహించడం అభినందించదగ్గ విజయమని పేర్కొన్నారు. అనంతరం ప్రముఖ కవులు రవిమారుత్, ఆనందాచారి, పుష్పాలకృష్ణమూర్తి, ప్రముఖ రచయిత్రులు రమాదేవి కులకర్ణి, మూర్తి శ్రీదేవి, విశ్మైక మాట్లాడుతూ పురిమళ్ల ఫౌండేషన్ వ్యవస్థాపకులు పురిళ్ల సునంద, భోగోజు ఉపేందర్‌రావు చేస్తున్న సేవలను కొనియాడారు. పురిమళ్ల ఫౌండేషన్ ఉద్దేశ్యాన్ని, లక్ష్యాలను వ్యవస్థాపకులు పురిమళ్ల సునంద వివరించారు. కథల, కవితల పుస్తకాన్ని అక్షరాల తో వ నిర్వాహకులు రాచమళ్ల ఉపేందర్ సమీక్షించారు. తొలుత తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ గీతంతో సభ ప్రారంభమైంది. ప్రతిఏటా అందచేస్తున్న భోగోజు సము ద్రమ్మ-పురుషోత్తం స్మారక పురస్కారాన్ని ప్రముఖ రచయిత మాల్యశ్రీకి అతిథుల చేతుల మీదుగా అందచేసి సన్మానించారు. అనంతరం అంతర్జాతీయస్థాయిలో నిర్వహించిన పోటీ ల్లో విజేతలైన కథకులకు, కవులకు పురస్కారాలు అందజేసి సన్మానించారు. బాలసాహిత్యంలో రాణించి పోటీల్లో విజేతల కు బాల కవులకు, కథలకు సన్మానం చేశారు. సభకు రెండు తెలుగు రాష్ట్రాల నుండి కవులు హాజరయ్యారు. ఈ కార్యక్ర మంలో అక్షరాల తోవ నిర్వాహకులు దాసరోజు శ్రీనివాస్, కవయిత్రి తాళ్ళూరి లక్ష్మీ, కవులు దేవేంద్ర, కన్నెగంటి వెంకట య్య, సయ్యద్ షఫీ, పోతగాని సత్యనారాయణ, కొత్తపల్లి శేషు, కపిల రాంకుమార్, కంచర్ల శ్రీనివాస్, మేడగాని శేషగిరి, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, ఐనాల సైదులు, కోంద్రు బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ఎదురు చూపులు!

(5వ పేజీ తరువాయి)

యాజమాన్యంపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. బదిలీల్లో పెద్దఎత్తున పైరవీలు సాగుతున్నాయనే నేపథ్యంలో బదిలీలకు మరికొంత సమయం తీసుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇప్పటికే సింగరేణి వ్యాప్తంగా సుమారు 600లకు పైగా వివిధ ప్రజాప్రతినిధుల ద్వారా బదిలీలకు సిఫార్సులు వచ్చినట్లు తెలుస్తోంది. రాష్ట్ర మంత్రులు, కేంద్రంలో పలువురు మంత్రులు సైతం కొందరు కార్మికులకు తమ సిఫార్సు లేఖలను అందించడం గమనార్హం. దీంతో యాజమాన్యం కార్మికుల బదిలీల అవసరాలు, ఏరియాల్లో ఖాళీగా ఉన్న పోస్టులు బదిలీలకు సంబంధించిన వివరాలను సేకరించింది. బదిలీలపై ఇప్పటికే పలు కార్మిక సంఘాలు యాజమాన్యంపై ఒత్తిడి తెస్తున్నాయి. విద్యాసంవత్సరం ప్రారంభ దశలోనే బదిలీలు చేస్తే కార్మిక కుటుంబాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ క్రమంలో బదిలీలపై యాజమాన్యం విధిస్తున్న ఆంక్షలపై కార్మిక సంఘాలతో పాటు ప్రజాప్రతినిధులు సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది. సింగరేణి ప్రధాన కార్యాలయంలోని కీలక విభాగంలో బదిలీల పక్రియ నిలిపివేశారనే ప్రచారం సాగడం వల్ల కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంటుంది. సింగరేణి యాజమాన్యం ప్రత్యేక గ్రీవెన్స్ వంటి కార్యక్రమాలను నిర్వహించి కార్మికులతో మాట్లాడి బదిలీలు చేయడం వల్ల పైరవీలకు ఆస్కారం ఉండదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. బదిలీల్లో పైరవీలు జరుగుతున్నాయనే నెపంతో మొత్తానికి బదిలీల వ్యవస్థను నిలిపి వేయడం వల్ల కార్మికులు ఇబ్బందులను ఎదుర్కొంటున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇటీవల యాజమాన్యం మూడేళ్లే పూర్తైతేనే బదిలీకి అర్హులంటూ విధించిన ఆంక్షల ప్రకారమైన బదిలీలు చేస్తే తమకు కొంత న్యాయం జరుగుతుందని పలువురు చెబుతున్నారు. మరో నాలుగు నెలలైతే డిసెంబర్ మాసం ముగిస్తే జనవరి నుంచి మళ్లీ బదిలీలపై ఆంక్షలు పెట్టే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో యాజమాన్యం స్పందించి.. అర్హతను బట్టి బదిలీలు చేయాలని కార్మికులు కోరుతున్నారు.

సెల్‌ఫోన్ షాపులో అగ్నిప్రమాదం

సుమారు రూ.4.25 లక్షల ఆస్తినష్టం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది, ట్రాఫిక్ ఎస్ఐ ప్రవీణ్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం చిన్నబజార్‌లో ఓ సెల్ పాయింట్ షాప్‌లో ఆదివారం ఉదయం ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.4.25 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు కొత్తగూడెం అగ్నిమాపకశాఖ అధికారి జి.పుల్లయ్య తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం నాలుగు గంటల సమయంలో పట్టణంలోని చిన్న బజార్‌లో కుమార్‌బాబుకు చెందిన దుర్గాభవానీ సెల్‌ఫోన్, వాచ్ షాప్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ క్రమంలో త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రాత్రి పెట్రోలింగ్ డ్యూటీలో ఉన్న కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వో గడ్డం ప్రవీణ్‌కుమార్ చాకచక్యంగా స్పందించి, అగ్నిమాపకశాఖకు సమాచారం అందించారు. అనంతరం త్రీటౌన్ బ్లూకోట్స్ పోలీసులను అప్రమత్తం చేశారు. అనంతరం పోలీసులు, ఫైర్ సిబ్బందితో కలిసి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ మంటలు పక్క దుకాణాలకు వ్యాపించకుండా నివారించారు. ఈ ఘటనలో అగ్నిమాపకశాఖ సిబ్బంది రఘు, షమీర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న బొలెరో

యువకుడికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన రాంబాబు

జూలూరుపాడు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని బొలెరో వాహనం (ట్రాలీ) ఢీకొట్టడంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని వెంగన్నపాలెంలోని ముత్యాలమ్మతల్లి అలయ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. మండలంలోని గంగారం తండాకు చెందిన ధారావత్ రాంబాబు అనే గిరిజన యువకుడు ద్విచక్ర వాహనంపై జూలూరుపాడు నుంచి గంగారం తండాలోని ఇంటికి వెళుతున్నాడు. ఈ క్రమంలో గుండెపుడి నుంచి జూలూరుపాడు వైపు వస్తున్న బొలెరో వాహనం వెంగన్నపాలెంలోని ముత్యాలమ్మతల్లి ఆలయ సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై ఉన్న రాంబాబుకి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలాన్ని హెడ్‌కానిస్టేబుల్ దయానంద్ సందర్శించి వివరాలను నమోదు చేశారు. యువకుడిని వైద్యచికిత్సల నిమిత్తం 108 వాహనంలో కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ల సీజ్


సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

ఆళ్లపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కాచనపల్లి అటవీ ప్రాంతం నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక రవాణాను ఆళ్లపల్లి పోలీసులు ఆదివారం అడ్డుకున్నారు. బాటన్ననగర్ గ్రామ సమీపంలోని ఓ వాగు నుండి ట్రాక్టర్లతో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు ఎస్సై సోమేశ్వర్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ మేరకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుకొని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

అంతర్జాతీయ స్పోర్ట్స్ డే సంబురాలు

కొత్తగూడెంలో 2కే రన్, వివిధ క్రీడా పోటీలు

జెండా ఊపి ప్రారంభించిన డీవైఎస్‌వో పరంధామరెడ్డి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న అంతర్జాతీయ స్పోర్ట్స్‌డే సందర్భంగా జిల్లా యువజన క్రీడలశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంబురాల్లో భాగంగా ఆదివారం కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో 2కే రన్‌ను డీవైఎస్‌వో పరంధామరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీవైఎస్‌వో మాట్లాడుతూ ఆరోగ్యకరమైన నవ సమాజం నిర్మించడంలో క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రతి క్రీడలో స్ఫూర్తిని ప్రదర్శిస్తూ గెలుపోటములను సమానంగా స్వీకరించాలని తెలిపారు. అనంతరం రైల్వేస్టేషన్ వరకు జరిగిన 2కే రన్‌లో వివిధ క్రీడా అసోసియేషన్ సభ్యులు, కార్యాలయ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలు

స్పోర్ట్స్ డే సందర్భంగా జిల్లా డీవైఎస్‌వో ఆదేశాల మేరకు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో అండర్-9, అండర్-11 బాల, బాలికలకు షటిల్ బ్యాడ్మింటన్ జిల్లాస్థాయి పోటీలను ఆదివారం హనుమాన్ బస్తీలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. సింగిల్స్ విభాగంలో నిర్వహించిన ఈ పోటీల్లో 40మంది బాల, బాలికలు పాల్గొన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు స్పోర్ట్స్ డే రోజున కలెక్టర్ జితేష్ వి పాటిల్ చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ కె.రమేష్, సభ్యులు శ్రీనివాసరావు, యాకూబ్‌పాషా, శ్రీకాంత్, హసన్, ఉదయ్, వెంకీ, హరీష్, నాగరాజు, సాగర్, తదితరులు పాల్గొన్నారు.


కొత్తగూడెంలో 2కే రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న డీవైఎస్‌వో పరంధామరెడ్డి


అండర్-9, 11 విభాగాలు బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్న బాల, బాలికలు

ఘనంగా కోయతూర్ పండుగ

ముసలమ్మ ఆలయం వద్ద మొక్కులు చెల్లించుకున్న భక్తులు


ముసలమ్మ ఆలయంలో పూజలు

కరకగూడెం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రఘునాధపాలెం గ్రామంలో ఆదివారం ఆదివాసీలు ఘనంగా కోయతూర్ సంస్కృతి సాంప్రదాయ పండుగను కన్నుల పండుగగా నిర్వహించారు. ఆది మూలవాసులైన పూర్వ పెద్దల ఆనవాయితీ ప్రకారం కోయ ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయ ప్రతిబింబంగా మగమొదటి పాదం రోజున పండుగను సామే కొత్తల పండుగ (పొట్ట పండుగ)ను పోలెబోయిన, పులి వంశీయులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మక్క(ముసలమ్మ) తల్లి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి సంప్రదాయ నృత్యాలు గట్టు గోత్రాలు ఆచారాలు, మేళతాళలతో కోయతూర్ పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి సిద్ధమూన వరి, సామ, కుంకుమలతో జిబిలినార తోరణాలను అలంకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పోలెబోయిన బాబు, వెంకటయ్య, సత్యం, లక్ష్మయ్య, సారయ్య, పులి నారాయణ, రాంమూర్తి, రామకృష్ణ, సమ్మయ్య, గొంది బాల కృష్ణ, రవి, సోలం కృష్ణ, రాంగోపాల్, కార్తీక్, రాజు, సిద్దు, మాణిక్యం గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.


ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న ఆదివాసీలు

తెల్లవారుజాము నుంచే యూరియా కోసం క్యూ

ఖమ్మం జిల్లా కారేపల్లిలో ఘటన

కారేపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం జిల్లా కారేపల్లి సహకార సొసైటీ కార్యాలయం ఎదుట యూరియా కోసం రైతులు ఆదివారం తెల్లవారు జాము నుంచే క్యూ కట్టారు. యూరియా కోసం రైతులు శనివారం ఆందోళన చేసిన నేపథ్యంలో.. అధికారులు ఆదివారం యూరియాను తెప్పించారు. 335కట్టలతో కూడిన లారీ సొసైటీ కార్యాలయం వద్దకు చేరుకుంది. అయితే అప్పటికే తెల్లవారు జాము నుంచే 500 మందికి పైగా రైతులు క్యూలో నిల్చొన్నారు. దీంతో అధికారులు, సొసైటీ సిబ్బంది కొంత మంది రైతులకు నచ్చచెప్పి.. ముందుగా క్యూలో ఉన్న వారికి యూరియా బస్తాలు ఇచ్చి అక్కడి నుంచి పంపించి వేశారు.


కారేపల్లి సొసైటి కార్యాలయంలో యూరియా కోసం క్యూ కట్టిన రైతులు

ఈ నెల 30 వరకు అడ్మిషన్లకు గడువు


మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ధర్మానాయక్

ఖమ్మం ఖానాపురంహవేలి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో అడ్మిషన్లు పొందడానికి ఈనెల 30వ తేదీ వరకు గడువు ఉందని ప్రాంతీయ అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ గుగులోతు వీరన్న తెలిపారు. ఆదివారం ఎస్ఆర్ అండ్‌బిజీఎన్ఆర్ ప్రభుత్వ కళాశాలలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కోఆర్డినేటర్లు కౌన్సిలర్లు, జాక్సల సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ధర్మానాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని అడ్మిషన్ల ప్రక్రియను వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అతి తక్కువ ఫీజులతో బీఏ, బీకాం, బీఎస్సీ, పీజీ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పిస్తుందన్నారు. ఇంటర్, డిప్లమా, ఐటీఐ కోర్సులు చేసిన విద్యార్థులు నేరుగా ఆన్‌లైన్‌లో అప్లికేషన్లు నింపి సమీప అధ్యయన కేంద్రంలో సర్టిఫికెట్లను ధ్రువపరిచి ట్యూషన్ ఫీజు చెల్లించాలని తెలిపారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ట్యూషన్ ఫీజులను ఈ నెల 30వ తేదీలోగా చెల్లించాలన్నా రు. బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం సరికొత్త కోర్సులతో పాటు ట్రాన్స్‌జెండర్, కోయ, చెంచు, కొండరెడ్డి వంటి వాళ్లకు ఉచిత విద్యను అందిస్తుందని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న అధ్యయన కేంద్రాల గురించి వారికి వివరించి అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సీనియర్ అధ్యాపకులు డాక్టర్ పి.సర్వేశ్వరరావు, డాక్టర్ బి.నాగేశ్వరరావు, కౌన్సిలర్లు జార్జ్ రాజ్కుమార్, రామ్మూర్తి బకాస్, పలువురు కౌన్సిలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కారు ధ్వంసంపై ఫిర్యాదు

దుమ్ముగూడెం ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తులు కారును ధ్వంసం చేసిన ఘటనపై బాధితుడు ఆదివారం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు అంజుబాకకు చెందిన కొడిమి దుర్గాప్రసాద్ అనే యువకుడు శనివారం రాత్రి తన ఇంటి ముందు కారును నిలిపి ఉంచాడు. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఆ కారు అద్దాలను ధ్వంసం చేశారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

దుమ్ముగూడెం ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): చినార్లగూడెం సమీపాన కొంగవాగు వంతెన వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొందరు యువకులు గాయపడ్డారు. కారు అదుపు తప్పి వంతెన రైలింగ్‌కు ఢీకొట్టింది. కారు ముందు భాగం తీవ్రంగా ధ్వంసమైంది. ఈ ప్రమాదానికి లోనైన యువకులు పాల్వంచకు చెందిన వారిగా తెలుస్తోంది. స్థానికుల సాయంతో క్షతగాత్రులను భద్రాచలం ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం.

మావోయిస్టుల భారీ డంప్ స్వాధీనం

దుమ్ముగూడెం ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): భద్రతా బలగాల సెర్చ్ ఆపరేషన్లు, ఎన్‌కౌంటర్లతో మావోయిస్టులకు వరుసగా ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. తాజాగా సుక్మా జిల్లా దుల్లేడ్ -మెట్టుగూడెం అటవీ ప్రాంతంలో 203 కోబ్రా బెటాలియన్, సీఆర్‌పీఎఫ్ 131 బెటాలియన్లు సంయుక్తంగా కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో మెట్టుగూడ గ్రామం నుంచి 1.5 కిలోమీటర్ల దూరంలో ఒక గుహలో మావోయిస్టుల భారీ డంప్‌ను బెటాలిన్ బలగాలు కనిపెట్టాయి. ఈ మేరకు గుహలో 21 ఐఈడీలు, మల్టీ బ్యారల్ గ్రెనేడ్ లాంచర్, ఒక విద్యుత్ జనరేటర్ సెట్, లాత్ మిషన్ పరికరాలు, భారీ మొత్తంలో పేలుడు తయారీ పదార్థాలు, తుపాకీ తయారీ పరికరాలు, వైద్య సామగ్రిని పోలీస్ బలగాలు స్వాధీనపర్చుకున్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ఖమ్మం ఖానాపురంహవేలి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఓ అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఇటీవల ఖమ్మం పరిధిలోని మల్లెమడుగు రైల్వేస్టేషన్ దగ్గర గుర్తుతెలియని వృద్ధుడు రైలు ఢీకొని మృతి చెందాడు. ఆ మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చారు. ఈ మృతదేహం కొరకు ఎవరూ రానందున ఖమ్మం రైల్వే పోలీసులు మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం నగరంలోని అన్నం ఫౌండేషన్‌కు సమాచారం అందించారు. అన్నం శ్రీనివాసరావు తన సిబ్బందితో పాటు ఆస్పత్రికి వచ్చి మార్చురీలోని మృతదేహాన్ని పోలీసులు, ఆస్పత్రి సిబ్బంది సమక్షంలో తీసుకోని నగరంలోని బల్లేపల్లి వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఖమ్మం రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పది రోజుల క్రితం గడ్డి మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కూసుమంచి మండలం, జీళ్ళ చెరువు గ్రామానికి చెందిన అంబాల భాస్కర్ (28) మద్యానికి బానిసైయ్యాడు. జీవితంపై విరక్తి చెందిన భాస్కర్ ఈనెల 14వ తేదీన తల్లంపాడు గ్రామంలోని ఓ వెంచర్‌లో గడ్డి మందుతాగానని కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే కుటుంబ సభ్యులు అక్కడి చేరుకుని అతన్ని ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పది రోజులుగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజు తెలిపారు.

విద్యుదాఘాతానికి రెండు ఆవులు మృతి


మృతిచెందిన ఆవులు వద్ద రైతుల ఆవేదన

కామేపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఘాతుకానికి రెండు ఆవులు మృతి చెందిన సంఘటన ముచ్చర్లలో ఆదివారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం ముచ్చర్లకు చెందిన రైతులు బత్తుల ఐలయ్య, బాడిశ మల్లయ్యకు చెందిన దుక్కిటావులు మేత కోసం వెళ్లి అక్కడి తెగి పడివున్న 11కేవి విద్యుత్ వైర్లు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. ఒక్కొక్క ఆవు ఖరీదు రూ.80వేలు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

మద్యం తాగి వేధిస్తున్నాడని భర్తపై భార్య దాడి

తీవ్ర గాయాలు.. కేసు నమోదు


తీవ్ర గాయాలైన గంగరాజు

పెనుబల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి తరచూ వేధిస్తున్నా డంటూ భర్తపై భార్య దాడి చేసి చితకబాదిన ఘటన ఖమ్మం జిల్లా పెనుబలి మండలం వీఎంబంజర్‌లో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. వీఎంబంజర్ గ్రామానికి చెందిన పర్వతం గంగరాజుకు లక్ష్మీతో 25ఏళ్ల క్రితం వివాహమైంది. గంగరాజు ఇటీవల తరచూ మద్యం తాగి ఇంటికి వచ్చి భార్య, పిల్లలతో గొడవ పడుతున్నాడు. ఈ విషయమై గత కొంత కాలంగా ఇద్దరి మధ్య ఘర్షణలు తలెత్తుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం కూడా మద్యం తాగి ఇంటికి వచ్చిన గంగరాజు భార్య లక్ష్మీని తిట్టి కొట్టసాగాడు. దీంతో ఎదురుతిరిగిన లక్ష్మీ భర్త గంగరాజు నోట్లో గుడ్డలు కుక్కి ఆ తర్వాత దాడి చేసింది. దీంతో తీవ్రంగా గాయపడిన గంగరాజును పెనుబల్లి ఆస్పత్రికి తరలించగా.. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం జిల్లాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై వీఎంబంజర్ పోలీసులు లక్ష్మీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

హీన పరిస్థితిలో లక్ష్మి ప్రసన్న మృతదేహం

కాలు జారిపడిందంటూ రాజమండ్రి ఆస్పత్రికి తరలింపు

భర్త, అత్తింటి వారు హింసించి చంపారంటూ

పోలీసులకు మృతురాలి తండ్రి ఫిర్యాదు

భర్తతో పాటు నలుగురిపై కేసు నమోదు


మృతురాలు లక్ష్మీప్రసన్న(ఫైల్)


ఎముకుల గూడులా ఉన్న మృతదేహం

అశ్వారావుపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా ఓ వివాహిత అత్యంత హీన స్థితిలో ఒల్లంతా గాయల మచ్చలు, తిండీ తిప్పలు లేకుండా ఎముకుల గూడులా మారిన శరీరంతో మృతిచెంది ఉన్న దృశ్యం ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేటలో జరిగింది. మృతురాలు పూల లక్ష్మీప్రసన్న(33) రాజమండ్రి ఆస్పత్రిలో విగతజీవిగ మారిన సమయంలో కొందరు తీసిన ఫొటోల్లో కనిపించిన దృశ్యాలు హృదయ విదారకంగా కనిపించాయి. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఈ విధంగా ఉన్నాయి. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం బుచ్చవరానికి చెందిన లక్ష్మీప్రసన్నను అదే మండలంలోని ఖాన్‌ఖాన్ పేటకు చెందిన పూల నరేష్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి మూడు సంవత్సరాల పాప కూడా ఉంది. భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతుండటంతో నరేష్ అక్క దాసరి భూలక్ష్మి వారికి సర్దిచెప్పి అశ్వారావుపేటలోని తన ఇంటిలో నివాసం ఉండేలా మార్చారు. ఆదివారం ఉదయం లక్ష్మీప్రసన్న ఇంట్లో పనిచేస్తుండగా కాలు జారి కిందపడడంతో నుదుటికి, మొఖంపైన తీవ్రంగా గాయాలయ్యాయని, దీంతో ఆమెను రాజమండ్రిలోని కిమ్స్ హాస్పటల్‌కు చికిత్స నిమిత్తం తరలిస్తున్నట్టు భర్త నరేష్ మృతిరాలి తల్లి దండ్రులకు సమాచారం ఇచ్చాడు. దీంతో తల్లిదండ్రులు హుటాహుటిన రాజమండ్రి ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ తమ కుమార్తె వెంటిలేటర్‌పై ఉండి, శారీరకంగా కుసించుపోయి శరీరంపై మానిన గాయాలతో ధారుణస్థితిలో మృతిచెంది కనిపించిందని మృతిరాలి తల్లిదండ్రులు తెలిపారు. తన కుమార్తెది సాధారణ మృతి కాదని అత్తింటి వారు హింసించి ధారుణంగా చంపేసారని ఆగ్రహం వ్యక్తం చేసిన మృతురాలి తండ్రి ముదిగొండ్ల వెంకటేశ్వరరావు అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఆస్పత్రిలో కుశించుపోయిన తన కుమార్తె లక్ష్మీప్రసన్న ఫొటోలను తండ్రి, కుటుంబీకులు పోలీసులకు, మీడియాకు అందజేశారు. దీనిపై విచారణ చేపట్టిన అశ్వారావుపేట ఎస్ఐ యయాతి రాజు మృతిరాలి భర్త పూల నరేష్, అత్త పూల విజయలక్ష్మి, ఆడపడుచు దాసరి భూలక్ష్మి, ఆమె భర్త శ్రీనుపై కేసు నమోదు చేసి దర్యాప్తును చేపట్టినట్టు పోలీసులు తెలిపారు. ఈ సంఘటన పట్టణంలో కలకలం సృష్టించింది.

ఉరివేసుకుని యువతి ఆత్మహత్య




కొర్లపుడి రమ్య (ఫైల్) సూసైడ్ లెటర్

తిరుమలాయపాలెం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రగడ్డ గ్రామంలో తీవ్ర విషాదం నెల కొంది. గ్రామానికి చెందిన ఓ యువతి తెలియని వయస్సులో ప్రేమపేరుతో తీసుకున్న నిర్ణయంతో నిండుప్రాణం బలికావడమే కాకుండా ఆ కుటుంబాన్ని తీవ్ర విషాదం నింపింది. వివరాలుఇలా.. గ్రామానికి చెందిన మేడా నరష్ అదే గ్రామానికి చెందిన కొర్లపుడి రమ్య(20) గత కొన్నేళ్లుగా ప్రేమించుకున్నారు. గతంలో ఇద్దరూ ఇంటి నుంచి వెళ్లిపోగా పెద్దలు నచ్చచెప్పి ఇంటికి తీసుకువచ్చారు. దీంతో ఇరువురు వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నారు. దీంతో నరేష్ వేరే యువతిని పెళ్లి చేసుకున్నాడు. రమ్య హైదరాబాదులో ఓ ప్రైవేట్ మెడికల్ షాపులో పనిచేస్తుంది. అనంతనం నరేష్ కూడా హైదరాబాదులో ఓ ఫార్మా కంపెనీలో పని చేస్తున్నాడు. రాఖీ పండగ రోజు నరేష్ అతని భార్యతో కలిసి ఎర్రగడ్డకు వచ్చాడు. తమ సోదరుడికి రాఖీ కట్టేందుకు రమ్య అక్కడకు వచ్చింది. ఈ క్రమంలో నరేష్ రమ్యను పెళ్లి చేసుకుని వైజాగ్ తీకుళ్లాడు. వైజాగ్‌లో టూటౌన్ పోలీసు స్టేషన్ సమీపంలో ఓ గది అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. ఈనెల 22న నరేష్ మ్యారేజ్ డే ఉండగా అతను రమ్యను అక్కడే ఉంచి చెప్పకుండా వెళ్లిపోయా డు. దీంతో రమ్య నరేష్‌కు పలుమార్లు ఫోన్‌చేసినా ఎత్తకపోవడంతో మనస్థాపం చెందిన రమ్య సూసైడ్ లెటర్ రాసి ఆత్మహత్యకు పాల్పడింది. ఈవిషయం తెలుసుకున్న వైజాగ్ పోలీసులు మృతురాలి వద్ద లభ్యమైన వివరాల ఆధారంగా ఎర్రగడ్డకు చెందిన యువతిగా గుర్తించారు. దీంతో ఖమ్మం పోలీసులకు తెలపగా వారు రమ్య కుటుంబానికి సమాచారం అందించారు. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు. రమ్య సూసైడ్‌లో నోట్‌లో ఏముంది, ఎవరి పేర్లు రాసి ఆత్మహత్యకు పాల్పడిందని గ్రామస్తుల్లో కలకలం రేగుతుంది. అయితే నరేష్ కోసం వైజాగ్ పోలీసులు ఆదివారం ఖమ్మం వచ్చారని తెలి సింది. ఈ మేరకు అతన్ని పట్టుకుని పోలీసులు విచారిస్తే అసలు ఏంజరిగిందో పూర్తి సమాచారం తెలిసే అవకాశం ఉంది.

కారు దొంగతనం కేసులో ఇద్దరి అరెస్టు

మణుగూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కారు దొంగతనం కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారిని రిమాండ్‌కు తరలించినట్లు మణుగూరు సీఐ నాగబాబు తెలిపారు. ఆదివారం రాత్రి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను తెలిపారు. ఈ నెల 13 వతేదిన మణుగూరు ప్రాంతానికి చెందిన మహమ్మద్ ఫిరోజ్ అనే వ్యక్తి తన టిఎస్ 28 జే 8256 నెంబర్ గల మహేంద్ర బొల్లారో నియో వాహనాన్ని ఆదర్శనగర్ లో పార్కు చేశాడు. ఈ వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేయగా మహమ్మద్ ఫిరోజ్ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ దొంగతనం కేసులో దర్యాప్తు లో బాగంగా ఆదివారం పోలీసులు దొంతనానికి గురైన వాహనాన్ని దొంతనానికి పాల్పడ్డ ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నట్లు తెలిపారు. వీరిలో షేక్ కరంతుల్ల సుందరయ్య నగర్ లారీ మెకానిక్, షేక్ నాజీరు లారీ డ్రైవర్ చెరువు ముందు సింగారం ప్రాంతాలకు చెందిన వారిగా గుర్తించామన్నారు. ఈ ఇద్దరు వ్యక్తులు జల్సాలకు బాగా అలవాటు పడి అప్పులు చేసి సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో దొంగతనానికి పాల్పడినట్లు విచారణలో వెల్లడైందన్నారు ఇద్దరి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. ఆ సమావేశంలో ఎస్ఐ రంజిత్, సిబ్బంది, కోటి, ప్రవీణ్, వీరా రామారావు పాల్గొన్నారు.


కారు దొంగిలించిన వారిని అరెస్టు చేసిన పోలీసులు



రైతులకు వెంటనే యూరియా అందించాలి: సీపీఎం

వైరా, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులకు వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూరియాను అందించాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. బాజోజు రమణ అధ్యక్షతన ఆదివారం జరిగిన సీపీఎం సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులకు యూరియా సరఫరా చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రాష్ట్ర ప్రభుత్వానికి ముందుచూపు కొరవడిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం రైతుల అవసరాల మేరకు రాష్ట్రానికి యూరియా సరఫరా చేయడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గుడిమెట్ల మోహన్‌రావు, కుటుంబరావు పాల్గొన్నారు.

వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ అందేలా సహకరించండి



మంత్రి తుమ్మలకు వినాయక చిత్రపటాన్ని బహూకరిస్తున్న దృశ్యం

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): గణేష్ మండపాలకు గత సంవత్సరం ఇచ్చిన ఉచిత విద్యుత్ మాదిరిగానే ఈ ఏడాది గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ అందించేందుకు సహకరించాలని కోరుతూ ఆదివారం స్తంభాద్రి ఉత్సవ కమిటీ సభ్యులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆదివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కోరారు. గణేష్ నిమజ్జనం రోజున గాంధీచౌక్‌లో నిర్వహించే సార్వజనిక గణేష్ నిమజ్జన వీడ్కోలు సభకు హాజరుకావాలని కోరారు. ప్రజలు గణేష్ నవరాత్రులను ప్రభుత్వ, అధికారుల సూచనల ప్రకారం నిర్వహించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాధు రమేష్‌రెడ్డి, స్తంభాద్రి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వినోద్ లాహోటి, ఉత్సవ కమిటీ నాయకులు గెంటేల విద్యాసాగర్, జయపాల్ రెడ్డి, కన్నం ప్రసన్న కృష్ణ, అల్లిక అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మునిసిపాలిటీలో ప్రజావాణి కార్యక్రమం

ఖమ్మం రూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీ కార్యాలయంలో సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. ఇక నుంచి ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాజ్యాంగ పరిరక్షణకు ముందుకు రావాలి

» సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి పౌరుడు ముందుకు రావాలని సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంచికంటి భవన్‌లో బీహార్ ప్రత్యేక ఓటర్ సవరణ లోపాలు, రాజ్యాంగ పరిరక్షణ అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. బీజేపీయేతర ఓట్లను తొలగిస్తుందని ఆరోపించారు. నాయకులు బీ. తిరుమలరావు, డాక్టర్ ఎంఎఫ్ గోపినాథ్, ఆరిఫ్, రవి మారుతి, ఐవీ రమణరావు, ఆసద్, ఖమర్, చిర్రా రవి, మేకల సుగుణరావు, ఎస్‌కే మీరా, ఆసీఫ్, ఎస్ నవీన్‌రెడ్డి, మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ



కుట్టుమిషన్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఖమ్మంచర్చికాంపౌండ్, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): ఖమ్మంజిల్లా పెరిక (పురగిరి క్షత్రియ) సేవా సంఘం ఆధ్వర్యంలో పెరిక కులస్తుల మహిళలకు ఎలక్ట్రిక్ కుట్టుమిషన్లను ఉచితంగా ఆదివారం నగరంలోని సంఘం కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు గజ్జవెల్లి సత్యనారాయణ మాట్లాడుతూ పెరిక కులంలో ఆర్థికంగా వెనుకబడి ఉన్న కుటుంబాల వారిని సంఘం ఆధ్వర్యంలో ఆదుకోవాలనే ఉద్దేశంతో పనిచేస్తున్నామన్నారు. అందులో భాగంగానే 26మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపణీ చేశామన్నారు. ఈ కుట్టుమిషన్లను ఉపయోగించుకుని ఆర్థికాభివృద్ధి చెందాలని కోరారు. ఈకార్యక్రమంలో కానుగంటి శ్రీనివాస్, సంఘం గౌరవ అధ్యక్షుడు బంధు సూర్యం, ప్రధాన కార్యదర్శి చింతల లింగేశ్వరరావు, సోమిశెట్టి వెంకటేశ్వరరావు, ముత్తినేని రత్నాకర్, బెడద సత్యనారాయణ, పత్తిపాక రమేష్, కార్పొరేటర్ గజ్జల లక్ష్మి వెంకన్న, పత్తిపాక లత తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి: ఎస్ఐ



మాట్లాడుతున్న ఎస్ఐ జగదీష్

తిరుమలాయపాలెం, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలని ఎస్ఐ కూసుపుడి జగదీష్ తెలిపారు. ఆదివారం మండలంలోని జింకలగూడెంలో గణేష్ ఉత్సవాలపై గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి ఘర్షణలు జరగకుండా కమిటీ సభ్యులు చూడాలన్నారు. అలాగే గణేష్ కమిటీ సభ్యులు తప్పనిసరిగా పోలీసువారి అనుమతి తీసుకోవాలన్నారు. డీజే సౌండ్లతో ప్రజలను ఇబ్బంది పెట్టవద్దన్నారు. పోలీసు నియమాలను పాటించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎస్‌డీ సైదా, సంతోష్‌రెడ్డి, మదార్, హిమాం, పాల్గొన్నారు.

యూరియా కొరత రైతుల వ్యథ

» అవసరం 3200 మెట్రిక్ టన్నులు.. వచ్చింది 1600 మెట్రిక్ టన్నులే
» గోడౌన్ లేదనేసాకుతో ముందుకు రాని సొసైటీ పాలకవర్గాలు

కూసుమంచి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా కొరత తప్పడం లేదు. భారీ వర్షాలు కురుస్తుండటంతో సాగర్ ఆయకట్టులోనూ, నాన్ ఆయకట్టులోనూ వరి, పత్తి, మిర్చి ఇతర పంటలసాగు ముమ్మరంగా సాగుతోంది. అయితే యూరియా అవసరం ఉన్నా అందుబాటులో ఉండకపోవడంతో ఎన్నడూ లేని విధంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవానికి ఈసీజన్‌లో 3,500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉన్నప్పటికీ వచ్చింది కేవలం 1,500 మెట్రిక్ టన్నులే. ఒక ఎకరాకు కనీసం ఒక యూరియా బస్తా అవసరం ఉంటుంది. ఒకటి కంటే ఎక్కువ అవసరం ఉంటే రైతులకు చుక్కలు కనపడుతున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం కేవలం ఆగ్రో ఎరువుల దుకాణాలకు మాత్రమే ఇస్తుండటంతో వారు నానో లిక్విడ్‌ను కానీ గుళికలు వంటి ఇతర పురుగుమందులు లింక్ పెడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.



ఏవోకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు(ఫైల్)

కూసుమంచి మండలంలో ఏటా సాగర్ ఆయకట్టులోనూ, నాన్ ఆయకట్టులోనూ 49,500 ఎకరాల్లో పంటలు సాగవుతాయి. 23వేల ఎకరాల్లో వరి, 11వేల ఎకరాల్లో పత్తి, 3వేల ఎకరాల్లో మిర్చి, 800 ఎకరాల్లో ఉద్యానపంటలు, 500ఎకరాల్లో అపరాలు సాగవుతాయి. ఇందుకుగాను వ్యవసాయశాఖ అధికారుల లెక్కల ప్రకారం 3,500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుంది. కానీ ఇప్పటికి సుమారు 1,400 మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా అయింది. పంటలు కళకళలాడుతూ ఏపుగా పెరుగుతున్న సమయంలో అవసరమైన యూరియా అందుబాటులో ఉండకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ఎరువుల దుకాణం దారులు తమ ఖాతాదారులకు మాత్రమే విక్రయిస్తున్నారని, ఇతర దుకాణాదారులు వెళితే యూరియా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సొసైటీలకు రాని యూరియా

గత కొన్నేళ్లుగా ప్రభుత్వం సహకారసంఘాల ద్వారానే యూరియా విక్రయిస్తోంది. అయితే జక్కేపల్లి, పెరికశింగారం సొసైటీలకు మాత్రమే వస్తోంది. మిగిలిన చోట్ల గోడౌన్‌లు, లైసెన్స్‌లు లేవనే సాకుతో విక్రయించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోనే అతిపెద్దసొసైటీ కల్లూరుగూడెం(కూసుమంచి) సొసైటీ ఉన్నప్పటికీ సంఘబాధ్యులు యూరియా తెప్పించాల్సి ఉన్నప్పటికీ నిర్లక్ష్యం వహిస్తూ, చొరవ తీసుకోకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవానికి ప్రభుత్వం యూరియా సొసైటీలకు, ఆగ్రో షాపులకు మాత్రమే విక్రయిస్తుంది. కూసుమంచిలో సొసైటీ ఉన్నప్పటికీ గోడౌన్ లేదని, విక్రయించేందుకు ఎవరూ లేరనే కారణంతో యూరియా తెప్పించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సొసైటీ సీఈవోను వివరణ కోరగా ప్రస్తుతం ఉన్న గోడౌన్ కబ్జాకు గురయిందని, పోలీసులకు ఫిర్యాదు చేసినా



జక్కేపల్లి సొసైటీ కార్యాలయం

పట్టించుకోవడం లేదని చెప్పడం గమనార్హం. కూసుమంచి, పాలేరు, జుజ్జులరావుపేట, నర్సింహులగూడెం, చౌటపల్లి గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉండే విధంగా సొసైటీ గోడౌన్ లీజ్‌కు తీసుకుని యూరియా తెప్పించి కొరత తీర్చాలని రైతులు కోరుతున్నారు.

యూరియా కొరత తీర్చాలి: రైతుసంఘం

రైతులకు యూరియా కొరత తీర్చాలని సీపీఎం రైతుసంఘం మండల కార్యదర్శి తోటకూరి రాజు, రైతు సంఘం మండల అధ్యక్షకార్యదర్శులు యడవల్లి రమణారెడ్డి, బిక్కసాని గంగాధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు ఏవోకు వినతిపత్రం అందించారు. మండలంలో ఫెర్టిలైజర్ వ్యాపారులు యూరియాకు ఇతర మందులు లింక్‌పెడుతున్నారని, కృత్రిమకొరత సృష్టిస్తున్నారని ఆరోపించారు. సరిపడా యూరియా అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతున్నారు.

రైతులను ఆదుకోవాలి

కందుల వెంకన్న, రైతు, కూసుమంచి



యూరియా కొరత కారణంగా ఇబ్బందులు పడుతున్నా. నేను 8ఎకరాలు పొలం కౌలుకు తీసుకుని వరిసాగుచేశాను. ఇప్పుడు యూరియా అవసరం ఉంటుంది. ఎక్కడ షాపులో అడిగినా లేదంటున్నారు. ఏంచేయాల్లో తెలియడం లేదు. ఒకరిద్దలు ఇతర మందులు కొంటేనే యూరియా ఇస్తామంటున్నారు. అధికారులు సమస్య తీర్చాలి. రైతులకు సరిపడా యూరియాను అందించి ఆదుకోవాలి.

మాలలు ఐకమత్యంగా ఉండి పోరాడాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో మాలలు ఎవరికి వారు సొంత సంఘాలు ఏర్పాటు చేసుకుని కార్యక్రమాలు నిర్వహించడం వలన భవిష్యత్తులో మాలల ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందని, మాలలంతా ఐకమత్యంగా ఉండి పోరాడాలని మాలమహానాడు సీనియర్ నాయకుడు గుంతేటి వీరభద్రయ్య పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మం నగరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉన్న అన్ని మాల సంఘాలు ఒకే గొడుకు కిందకు వచ్చి మాలమహానాడు పేరుమీద వర్గీకరణ వ్యతిరేక ఉద్యమంచేయాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలో ఖమ్మంలో జరిగే వనమహోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి వివేక్ గారిని ఆదివారం హైదరాబాదులో కలిసి ఆహ్వానించడం జరిగిందని ప్రకటనలో తెలిపారు.

నేడు వినాయక విగ్రహాల పంపిణీ

ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నుంచి గణపయ్య ఉచిత విగ్రహాల పంపిణీ జరగనున్నాయి. ఈ మేరకు కమిషనర్ 8వేల మట్టి విగ్రహాలను కేఎంసీకి తెప్పించారు. ఆదివారం రాత్రికి విగ్రహాలు కేఎంసీకి చేరుకున్నాయి. అన్ని ప్రాంతాల్లో వీటిని పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : చిన్ననాటి సంగతులు.. విద్యార్థి జీవితాన్ని అవలోకనం చేసుకుంటూ.. ఉల్లాసంగా, ఉత్సాహంగా ఆత్మీయంగా గడిపారు ఆ యువకులు. సారధినగర్ ఆదర్శ విద్యా నిలయం హైస్కూల్ 1994-95 10వ తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఒకరికొకరు పలకరించుకొని జ్ఞాపకాలను పంచుకున్నారు. ఎఫ్‌సిఐ బైపాస్‌రోడ్ లో ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. చదువుచెప్పిన నాటి గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆఫీస్ ఇన్‌చార్జ్ తుంబురు దయాకర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ ఈ సందర్భంగా విద్యార్థి జీవితం ఎంతో ఆనందకరమన్నారు. ఈ కార్యక్రమంలో సాంబశివరెడ్డి, అశోక్‌రెడ్డి, సత్యం, కళ్లెం జాన్‌రెడ్డి, సంజయ్, రామకృష్ణ, వినోద్, రవీందర్, సతీష్



సమ్మేళనంలో పాల్గొన్న ఆదర్శ విద్యానిలయం హైస్కూల్ పూర్వ విద్యార్థులు



బాలకృష్ణ, భూపాల్ రెడ్డి, అరుణ, లావణ్య, సోనీ, శ్రీదేవి, చంద్రకళ, అనిత తదితరులున్నారు.

ఖమ్మం లీగల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో 1972 నుంచి 1975 వరకు బీఎస్సీ(బీజెడ్సీ) పూర్వ విద్యార్థులు 50 సంవత్సరాల తరువాత గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ కోసం ఖమ్మంలోని గ్రాండ్ గాయత్రి హోటల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మొత్తం 45 మంది విద్యార్థులు వారి పాత రోజులను గుర్తుకుతెచ్చుకొని, ఒకరినొకరు పలకరించుకొని మెమెంటోలు బహూకరించుకున్నారు. రిటైర్డ్ ఎస్‌బీహెచ్ మేనేజర్ యరమళ్ల సుదర్శనరావు, రిటైర్డ్ పారా మెడికల్ ఆఫీసర్ ఆళ్ల వెంకటరావు, రిటైర్డ్ జుడిషియల్ ఆఫీసర్ బండి సత్యనారాయణ, రిటైర్డ్ ఎల్ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్, సీహెచ్.రామారావు, డి.వెంకటేశ్వర్లు, డి.సుధాకర్ కలసి దూర ప్రాంతాల్లో ఉన్నవారిని ఫోన్ల ద్వారా సంప్రదించి ఈ కలయికను ఏర్పచుకున్నారు. ఇలాంటి కలయిక ప్రతీ సంవత్సరం జరుపుకోవాలని ఆకాక్షించారు.

రహదారి ఇలా.. ప్రయాణించేదెలా..





ఇటీవల కురిసిన వర్షాలకు నగరంలోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారి కంకర తేలి అధ్వానంగా తయారైంది.. ఈరహదారిపై అక్కడక్కడ కంకరపోసి మరమ్మతులు చేపట్టారు. మరమ్మతులు చేపట్టిన కొన్నిరోజుల్లోనే కంకర లేచిపోయింది. దీంతో ఆ రహదారిపై నడిచే ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆంధ్రజ్యోతిస్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

గోదావరి నదిపై బ్యారేజీ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

» తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

కల్లూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) పంట సీజన్‌లో పట్టుమని పది రోజులు కూడా గోదావరి జలాల సరఫరా లేదని, రెండు పంటలకు గోదావరి జలాలు అందించాలంటే సత్వరమే గోదావరిపై సీతమ్మ బ్యారేజి పూర్తి చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండు చేశారు. మండలంలోని చెన్నూరు గ్రామంలో ఆదివారం సామినేని హనుమంతరావు అధ్యక్షతన మండల రైతు సంఘం మహాసభ జరిగింది. ఈ సభలో బొంతు రాంబాబు ప్రసంగిస్తూ గత రెండేళ్లుగా వారం, పది రోజులు గోదావరి జలాలు కల్లూరు, తల్లాడ, పెనుబల్లి మండలాల సాగు భూములకు సరఫరా చేసి చేతులు దులుపుకున్నారని అన్నారు. శాస్వతంగా గోదావరి జలాలు సరఫరా జరగాలంటే గోదావరిపై బ్యారేజ్‌తో పాటుగా సీతారామ ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. కేంద్ర ప్రభుత్వం పత్తి రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించే విధంగా విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పత్తిపై ఉన్న 11 శాతం సుంకాన్ని రద్దు చేయటాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. తెలంగాణలో యూరియా సక్రమంగా లేక పోవటంతో రైతులు తెల్లవారు జామున నుంచి క్యూ లైన్లో నిలబడి పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అవసరమైన



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

మేరకు యూరియా సరఫరా చేయాలని ఆయన డిమాండు చేశారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తాతా భాస్కరరావు మాట్లాడుతూ కౌలు రైతులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు అందిస్తూ బ్యాంకు రుణం మంజూరు చేయాలని కోరారు.

ఈ మహాసభలో రైతు సంఘం జిల్లా నాయకులు శీలం సత్యనారాయణరెడ్డి, రావుల రాజా బాబు, మాదాల వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ అధ్యక్షుడు తన్నీరు కృష్ణార్జునరావు, చింతలపూడి పురుషోత్తం, స్టాలిన్, లక్ష్మణ్‌రావు వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

ఏన్కూరు కళాశాలకు హాస్టల్ మంజూరు

ఏన్కూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు (బాలుర) పోస్టుమెట్రిక్ గిరిజన హాస్టల్ మంజూరైంది. ఈ మేరకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ హాస్టల్‌ను గురుకుల పాఠశాల సమీపంలోని సీఎల్ఆర్‌సీ భవనంలో సెప్టెంబరు 1నుంచి ప్రారంభించనున్నారు హాస్టల్ భవన మరమ్మతులకు రూ.2లక్షల ప్రభుత్వం మంజూరు చేసింది. హాస్టల్ మంజూరుకోసం ప్రిన్సిపాల్ మీట కోటి సింహాచలం గతేడాది అక్టోబరు నెలలో ఐటీడీఏ పీవో, ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని గిరిజన సంక్షేమశాఖ కమిషనర్‌తో మాట్లాడి హాస్టల్ మంజూరు చేయించారు.



హాస్టల్ భవనం

గిరిజన విద్యార్థులకు వరం

ఇక్కడ హాస్టల్ ఏర్పాటు గిరిజన విద్యార్థులకు వరంగా మారనుంది. ఈ మండలంలో ఎక్కువగా గిరిజన ప్రజలు నివసిస్తున్నారు. దూరప్రాంతాల నుంచి కళాశాలకు విద్యార్థులు రాలేక చదువులను అర్ధాంతరంగా మానేస్తున్నారు. హాస్టల్ సౌకర్యం ఉన్న దూర ప్రాంతాలకు విద్యార్థులు వెళ్లడంతో ఈ కళాశలలో అడ్మిషన్ల సంఖ్య తగ్గుతు వస్తోంది. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రిన్సిపాల్ సింహాచలం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఎమ్మెల్యే ద్వారా హాస్టల్‌ను మంజూరుచేయించారు.

వైరాలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

వైరా, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వైరాలో ఆదివారం జాతీయ క్రీడల దినోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక ఇండోర్ స్టేడియం వద్ద నిర్వహించిన జాతీయ క్రీడల దినోత్సవంలో షటిల్ పోటీలను రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్ ప్రారంభించారు. క్రీడలు శారీరక మానసిక ధృడత్వానికి దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీరామనేని విజయభాస్కర్, వెంకట్రావ్, శ్రీనివాసరావు, ప్రసాద్, నిఖిల్, అంజద్‌పాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొర్రా రాజశేఖర్

వైరాలో జాతీయ క్రీడా దినోత్సవం



వైరా, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వైరాలో ఆదివారం జాతీయ క్రీడల దినోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక ఇండోర్ స్టేడియం వద్ద నిర్వహించిన జాతీయ క్రీడల దినోత్సవంలో షటిల్ పోటీలను రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్ ప్రారంభించారు. క్రీడలు శారీరక మానసిక ధృడత్వానికి దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీరామనేని విజయబాస్కర్, వెంకట్రావ్, శ్రీనివాసరావు, ప్రసాద్, నిఖిల్, అంజద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

గుట్టలు గుల్ల.. ఐబీ గెస్ట్‌హౌస్ స్థలానికి వల

వైరా, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్కనే ఉన్న నీటిపారుదలశాఖ స్థలాన్ని ఒకరు దర్జాగా కబ్జా చేస్తున్న ఉదంతమిది. 110ఏళ్ల కిందట నిర్మించిన నీటిపారుదలశాఖ విశ్రాంతి భవనం ఉన్న కొండను పిండి చేస్తున్నారు. ఇప్పటికే ఈ స్థలంలోని గుట్టను కొంతమేర తొలిచివేశారు. దాంతో విశ్రాంతి భవనానికి ప్రమాదం పొంచి ఉంది. అయినప్పటికీ అధికార యంత్రాంగం చోద్యం చూస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దాదాపు 110ఏళ్ల కిందట గుట్టపై నిర్మించిన విశ్రాంతి భవనం శిథిలావస్థకు చేరింది. దాన్ని పునర్నిర్మించి పూర్వ వైభవం తీసుకురావాలని ఓవైపున డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క భావిస్తుండగా ఇప్పుడు ఏకంగా ఆ భవనానికి చెందిన స్థలాన్నే ఒక వ్యక్తి యథేచ్ఛగా కబ్జా చేస్తున్నాడు. ఐబీకి చెందిన స్థలం పక్కనే కొద్దిగా ఉన్న తన స్థలాన్ని ఆసరా చేసుకుని ఈ కబ్జాకు ఒడిగట్టాడు. ఇప్పటికే ఐబీ స్థలాల్లో ఒక ప్రణాళిక లేకుండా ఇండోర్ స్టేడియం, వెజ్ నాన్‌వెజ్ మార్కెట్, మునిసిపల్ కార్యాలయం, గిరిజన భవనం, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, ఆర్‌అండ్‌బీ ఆఫీసు ఇతర నిర్మాణాలు చేశారు. దాంతో నిజాం నవాబు హయాంలో 110ఏళ్ల కిందట క్యాంపు ఆఫీసుగా నిర్మించిన విశ్రాంతి భవనం శిథిలమైంది. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ఓవైపున అంటే మధిర రోడ్డు నుంచి ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లే రోడ్డు పక్కన కొంత స్థలాన్ని ఎన్‌పీడీసీఎల్ డీఈ ఆఫీసుకు కేటాయించారు. ఆ స్థలానికి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెనుక భాగంలో శిథిలావస్థలోని విశ్రాంతి భవనం ఉంది. ఇప్పుడా విశ్రాంతి భవనం వెనుక భాగంలోని కొండను పిండి చేస్తున్నారు. ఐబీ స్థలంలోకి చొచ్చుకుని వచ్చేలా రాళ్లను రాత్రింబవళ్లు పగులగొడుతున్నారు. ఐబీ స్థలం సరిహద్దు కోసం నిర్మించిన ప్రహరీగోడను కూల్చివేశారు. తమ సొంత జాగీర్‌లాగా ఐబీ స్థలంలోని కొండ రాళ్లను తొలగించేందుకు ఏ మాత్రం జంకూ బంకూ లేకుండా పనులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా మునిసిపల్, రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు కబ్జాకు గురైన స్థలాన్ని కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఐబీ స్థలం కబ్జాకు గురవుతున్న ఫిర్యాదు మేరకు ఆదివారం నీటిపారుదల శాఖ డీఈ శ్రీనివాస్ సిబ్బందిని పంపించి ఆ పనులను నిలిపివేయించారు. ఈ స్థలాన్ని పూర్తిస్థాయిలో పరిరక్షించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



వైరాలో నీటిపారుదలశాఖ స్థలంలోని గుట్ట రాళ్లను పగులగొట్టి స్థలాన్ని కబ్జా చేస్తున్న దృశ్యం

అధ్వానంగా పారిశుధ్యం

ఏన్కూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏన్కూరులో పారిశుధ్యం లోపించింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురు బజారులో డ్రెయినేజీ వ్యవస్థ లేక మురుగునీరు చెరువును తలపిస్తోంది. ఇండ్ల మధ్య మురుగునీరు చేరడంతో దోమల వ్యాప్తి పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఈ విషయమై అనేకసార్లు పంచాయతీ అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. అధికారులు స్పందించి డ్రెయినేజీ వ్యవస్థను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.



ఇళ్ల మధ్య చేరిన మురుగునీరు



నివాళులర్పిస్తున్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు

సురవరానికి ఘన నివాళి

వైరా, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వైనాలో ఆదివారం సీపీఐ జాతీయ నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పట్ల పలు రాజకీయ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు. సీపీఐ కార్యాలయంలో సుధాకర్‌రెడ్డి సంతాప సభ నిర్వహించారు. సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎర్రా బాబు, మండల, పట్టణ కార్యదర్శులు యామాల గోపాలరావు, మిట్టపల్లి రాఘవరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకుడు కంకణాల అర్జున్‌రావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొల్లేపల్లి శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బాణాల వెంకటేశ్వరరావు నివాళులర్పించారు.

పలు కుటుంబాలకు తుమ్మల పరామర్శ



రామతులిశమ్మకు నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల

తల్లాడ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపురం గ్రామంలో అనారోగ్యంతో మృతిచెందిన మాజీ ఎంపీటీసీ వేమిరెడ్డి రామతులిశమ్మకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం నారాయణపురంలో రామతులిశమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామతులిశమ్మ భర్త మాజీ సర్పంచ్ వేమిరెడ్డి కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సొసైటీ చైర్మన్లు దిరిశాల నరసింహారావు, తూము వీరభద్రరావు, మండల కాంగ్రెస్ నాయకులు జక్కంపూడి కిషోర్, రాయల రాము, పోతురాజు కోటయ్య, పొట్టేటి జనార్ధన్‌రెడ్డి, అప్పారావు పాల్గొన్నారు.

మధిర రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం సిరిపురం గ్రామంలో సీనియర్ నేత, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వెలగపూడి శివరాంప్రసాద్ కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందడంతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ ఖమ్మం పార్లమెంటరీ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, కాంగ్రెస్ నాయకులు మొండితోక సుధాకర్, చెరుకూరి నాగార్జున్, టీడీపీ నాయకులు వేమూరి సునీల్‌కుమార్, మేడా వెంకటేశ్వరరావు, గడ్డం రమేష్, మల్లాది హన్మంతరావు, వెలగపూడి సురేందర్ పాల్గొన్నారు.

రైతులకు వెంటనే యూరియా అందించాలి

వైరా, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులకు వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూరియాను అందించాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. బాజోజు రమణ అధ్యక్షతన ఆదివారం జరిగిన సీపీఎం సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులకు యూరియా సరఫరా చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రాష్ట్ర ప్రభుత్వానికి ముందుచూపు కొరవడిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం రైతుల అవసరాల మేరకు రాష్ట్రానికి యూరియా సరఫరా చేయడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో రైతుల అవసరాల మేరకు యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు గుడిమెట్ల మోహన్‌రావు, చెరుకుమల్లి కుటుంబరావు, బాదావత్ శ్రీనివాసరావు, అజ్మీరా రవి కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భూక్యా వీరభద్రం

బ్యారేజ్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి

» రెండు పంటలకు సాగు నీరు అందించాలి

కల్లూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) పంట సీజన్‌లో పట్టుమని పది రోజులు కూడా గోదావరి జలాల సరఫరా లేదని, రెండు పంటలకు గోదావరి జలాలు అందించాలంటే సత్వరమే గోదావరిపై సీతమ్మ బ్యారేజి పూర్తి చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండు చేశారు. మండలంలోని చెన్నూరు గ్రామంలో ఆదివారం సామినేని హనుమంతరావు అధ్యక్షతన మండల రైతు సంఘం మహాసభ జరిగింది. ఈ సభలో బొంతు రాంబాబు ప్రసంగిస్తూ గత రెండు సంవత్సరాలుగా వారం, పది రోజులు గోదావరి జలాలు కల్లూరు, తల్లాడ, పెనుబల్లి మండలాల సాగు భూములకు సరఫరా చేసి చేతులు దులుపుకున్నారని అన్నారు. శాస్వతంగా గోదావరి జలాలు సరఫరా జరగాలంటే గోదావరిపై బ్యారేజ్‌తో పాటుగా సీతారామ ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. కేంద్ర ప్రభుత్వం పత్తి రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించే విధంగా విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పత్తిపై ఉన్న 11 శాతం సుంకాన్ని రద్దు చేయటాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని రాంబాబు కోరారు. తెలంగాణలో యూరియా సక్రమంగా లేక పోవటంతో రైతులు తెల్లవారు జామున నుంచి క్యూ లైన్లో నిలబడి పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అవసరమైన మేరకు యూరియా సరఫరా చేయాలని ఆయన డిమాండు చేశారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు తాతా భాస్కరరావు మాట్లాడుతూ కౌలు రైతులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు అందిస్తూ బ్యాంకు రుణం మంజూరు చేయాలని కోరారు. ఈ మహాసభలో రైతు సంఘం జిల్లా నాయకులు శీలం సత్యనారాయణరెడ్డి, రావుల రాజా బాబు, మాదాల వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ అధ్యక్షుడు తన్నీరు కృష్ణార్జునరావు, చింతలపూడి పురుషోత్తం, స్టాలిన్, లక్ష్మణ్‌రావు వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బొంతు రాంబాబు

దివ్యాంగులకు అన్నదానం

బోనకల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నాగప్రసాదరావు, నీరజ దంపతుల కుమారుడు రాకేష్ జన్మదినం సందర్భంగా స్థానిక శాంతి నిలయంలో ఆదివారం దివ్యాంగులకు అన్నదానం చేశారు. కేక్ కట్ చేసి పండ్లు పంచారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యుడు తూము రోషన్ కుమార్ మాట్లాడుతూ.. అమెరికాలో స్థిరపడిన బత్తినేని సోదరులు రాకేష్, ప్రకాష్ ట్రస్టు ద్వార నిరుపేదలు, విద్యార్థులకు పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. నిరుపేదల కోసం ఉచిత వైద్య శిబిరాల నిర్వహణతో పాటు క్యాన్సర్ పరీక్షల గురించి అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు పుస్తకాల పంపిణీతోపాటు నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన చేపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, కొంగర బాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న దాతలు

రూ.లక్ష నగదు తిరిగి ఇచ్చిన ఆర్టీసీ డ్రైవర్

» నిజాయితీ చాటుకున్న రాంబాబు

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రయాణీకుడు పోగొట్టుకున్న రూ.లక్ష నగదు కలిగిన బ్యాగ్‌ను ఆర్టీసీ డ్రైవర్ ఒకరు తిరిగి ఇచ్చిన సంఘటన సత్తుపల్లిలో చోటుచేసుకుంది. ఆదివారం సత్తుపల్లి ఆర్టీసీ డిపోకు చెందిన టీఎస్07జడ్0278నంబర్ గల సూపర్ లగ్జరీ బస్సులో జోగులాంబ గద్వాల జిల్లా దర్గూరుకు చెందిన ప్రయాణీకుడు నరసింహ ఎంజీబీఎస్‌లో ఎక్కాడు. మార్గమధ్యలో సూర్యపేటలో బ్యాగ్‌ను మరిచిన నరసింహ దిగాడు. బ్యాగ్ మరిచినట్లు డ్రైవర్ బీ.రాంబాబు (825700)కు సమాచారం ఇవ్వగా బస్సులోనే ఉందని, సత్తుపల్లి డిపోకు రావాలని చెప్పడంతో పట్టరాని సంతోషంతో నరసింహ ఇక్కడికి వచ్చాడు. డిపోలో స్టేషన్ మేనేజర్ జాలాది ఆనందం, ఏడీసీ పాటి అప్పారావు, సెక్యూరిటీ కానిస్టేబుల్ నరేష్‌ల సమక్షంలో రూ.లక్ష నగదు కలిగిన బ్యాగ్‌ను ప్రయాణీకుడు నరసింహాకు తిరిగి అప్పగించడంతో ఆర్టీసీ సంస్థకు, ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపాడు. అదేవిధంగా నిజాయితీగా వ్యవహరించి ప్రయాణీకుడు మరిచిన బ్యాగ్‌ను అప్పగించిన డ్రైవర్ రాంబాబును డీఎం యూ.రాజ్యలక్ష్మీ, సీఐ పీ.విజయశ్రీ, ఎంఎఫ్ సిలివేరు సాహితీ, వీబీఓ కిన్నెర ఆనందరావులు అబినందించారు.



రూ.లక్ష నగదు కలిగిన బ్యాగ్‌ను అప్పగిస్తున్న డ్రైవర్ రాంబాబు

కేంద్ర, రాష్ట్ర పాలకులకు పట్టని రైతుల గోస

» సీపీఎం జిల్లా సభ్యుడు బొంతు

కారేపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి యూరియా సరఫరాలో కేంద్రలోని బీజేపీ ప్రభుత్వ వివక్షత, ముందుచూపులేని రాష్ట్ర ప్రభుత్వ చేతలతో ప్రజలు గోస పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యుడు బొంతురాంబాబు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పాటిమీదిగుంపులో నిర్వహించిన రైతు సదస్సులో బొంతురాంబాబు మాట్లాడుతూ.. యూరియా కొరతకు బాధ్యులు మీరంటే మీరని కేంద్ర, రాష్ట్ర పాలకులు ఆరోపించుకుంటూ రైతులను పట్టించుకోవడంలేదన్నారు. రైతులు సాగు పనులు పక్కన పెట్టి యూరియా కోసం పడిగాపులు కాయల్సిన పరిస్థితి తలెత్తిందని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా సరఫరాపై రైతులకు సరైన సమాచారం ఇవ్వకపోవడంపై రైతుల్లో అసహనం పెరిగి స్వచ్ఛందంగా రోడ్డెక్కుతున్నట్లు తెలిపారు. సీఐటీయూ జిల్లా నాయకులు కె.నరేందర్, రైతుసంఘం మండల కార్యదర్శి వజ్జ రామారావు నాయకులు సీతారామయ్య, మాజీ సర్పంచ్ రాంబాయమ్మ, ధనమ్మ, వెంకన్న, శ్రీనివాస్ రావు, రవి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొంతురాంబాబు

మాజీ సర్పంచ్ మృతి..సంతాపం తెలిపిన నామా

ఎర్రుపాలెం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సకినవీడు గ్రామంలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ సూరనేని వెంకట్రావమ్మ(69) ఆదివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. వెంకట్రావమ్మ మృతదేహాన్ని పలు పార్టీల నేతలు సందర్శించి నివాళులర్పించారు. ఆమె మృతిపట్ల బీఆర్‌ఎస్ నేత, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు సంతాపం తెలిపారు ఆమె భర్త మాజీ వైస్ ఎంపీపీ రామకోటేశ్వరరావుకు ఫోన్ ద్వారా పరామర్శించారు. జడ్పీమాజీచైర్మన్ లింగాల కమల్‌రాజ్, మధిర మార్కెట్ కమిటీచైర్మన్ బండారు నరసింహారావు కాంగ్రెస్ నాయకులు అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, చావా రామకృష్ణ, పసుపులేటి వెంకటనారాయణ, యరమల విజయ భాస్కరరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పంబి సాంబశివరావు, మొండితోక జయకర్, రంగిశెట్టి కోఏశ్వరరావు, కరివేదు వెంకటేశ్వరావు, మూల్పూరి శ్రీనివాసరావు, యూటీఎఫ్ ఉపాధ్యయ సంఘం బాధ్యులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

తీపి జ్ఞాపకాలను బంధించేదే ఫొటో: దయానంద్

సత్తుపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మరిచిన తీపి జ్ఞాపకాలను బంధించేది ఫోటో అని కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ అన్నారు. ఆదివారం స్థానిక లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో ఫోటోగ్రాఫర్ల ఫ్యామిలీ ఫంక్షన్‌లో ఆయన పాల్గొని ఫోటోగ్రఫీ పితామహుడు డాగూరే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్లు, వారి కుటుంబ సభ్యులకు మొక్కలను బహుమతిగా అందజేయగా ఫోటోగ్రాఫర్లు డా.దయానంద్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం మహిళలకు ఆటపాటలతో పాటు గేమ్స్ ఆడించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాపా రాంబాబుమూర్తి, వెంకట్, కనకారావు, రఘు, అశోక్, రమేష్, మూర్తి, సాయి, కిషోర్, సుమాంజలి రాము తదితరులు పాల్గొన్నారు.

చదువుపై దృష్టిపెట్టండి

యువసేవా సమితి 8వ వార్షికోత్సవం సందర్భంగా డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ మాట్లాడుతూ యువత మత్తుకు దూరంగా ఉండి చదువుపై విద్యార్థులు దృష్టిపెట్టి జీవితంలో రాణించి తల్లీదండ్రులకు మంచిపేరు తేవాలని కోరారు. కార్యక్రమంలో నిర్వహకులు జొన్నలగడ్డ రాజు, పుట్ట నితిన్, ఎస్‌ఐలు ప్రదీప్, కవితతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఏన్కూరు కళాశాలకు హాస్టల్ మంజూరు

» మంజూరుకు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ప్రత్యేక చొరవ

» సెప్టెంబరు1 నుంచి ప్రారంభం

ఏన్కూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు (బాలుర) పోస్టుమెట్రిక్ గిరిజన హాస్టల్ మంజూరైంది. ఈ మేరకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ హాస్టల్‌ను గురుకుల పాఠశాల సమీపంలోని సీఎల్‌ఆర్‌సీ భవనంలో సెప్టెంబరు 1నుంచి ప్రారంభించనున్నారు హాస్టల్ భవన మరమ్మతులకు రూ.2లక్షల ప్రభుత్వం మంజూరు చేసింది. హాస్టల్ మంజూరు కోసం ప్రిన్సిపాల్ మీట కోటి సింహాచలం గతేడాది అక్టోబరు నెలలో ఐటీడీఏ పీవో, ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని గిరిజన సంక్షేమశాఖ కమిషనర్‌తో మాట్లాడి హాస్టల్ మంజూరు చేయించారు.

గిరిజన విద్యార్థులకు వరం

ఇక్కడ హాస్టల్ ఏర్పాటు గిరిజన విద్యార్థులకు వరంగా మారనుంది. ఈ మండలంలో ఎక్కువగా గిరజన ప్రజలు నివసిస్తున్నారు. దూరప్రాంతాల నుంచి కళాశాలకు విద్యార్థులు రాలేక చదువులను అర్థాంతరంగా మానేస్తున్నారు. హాస్టల్ సౌకర్యం ఉన్న దూర ప్రాంతాలకు విద్యార్థులు వెళ్లడంతో ఈ కళాశలలో అడ్మిషన్ల సంఖ్య తగ్గుతు వస్తోంది. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రిన్సిపాల్ సింహాచలం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఎమ్మెల్యే ద్వారా హాస్టల్‌ను మంజూరుచేయించారు.



ఈ భవనంలోనే పోస్టు మెట్రిక్ హాస్టల్

నిరుపయోగంగా ప్రభుత్వ కార్యాలయాలు

ఏన్కూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాజుల సొమ్ము రాళ్లపాలు అన్నట్టుగా ఉంది ఏన్కూరు మండలం ప్రభుత్వ కార్యాలయాల దుస్థితి. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాలు నిరుపయోగంగా మారాయి. జిల్లాల పునర్విభజన తర్వాత సీఎల్‌ఆర్‌సీ భవనం మూతపబడింది. అప్పటి నుంచి లక్షల విలువైన భవనం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. శిథిలావస్థకు చేరి పాములు, తేళ్లకు ఆవాసంగా మారింది. వీఆర్వో వ్యవస్థ రద్దయిన తర్వాత వీఆర్వో కార్యాలయం కూడా నిరపయోగంగా మారింది. అలాగే వ్యవసాయశాఖ కార్యాలయం, ఆయుర్వేద భవనం కూడా నిరుపయోగంగా మారాయి. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి ఈ భవనాలను వేరే ప్రభుత్వ కార్యాలయాలకు ఉపయోగపడే విధంగా తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.



వీఆర్వో కార్యాలయం



సీఎల్‌ఆర్‌సీ భవనం



శిథిలావస్థలో ఆయుర్వేద భవనం

నిధుల లేమి.. కార్యదర్శులకు ఆర్థిక భారం

» సమస్యలు పరిష్కరించాలని వేడుకోలు

బోనకల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ముందు నుయ్యి, వెనుక గొయ్యి అన్నట్లు మారింది పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి. గత రెండు సంవత్సరాలుగా పంచాయతీలకు నిధుల విడుదల నిలిచి పోవడంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయించడానికి కార్యదర్శులే చేతి గుండా పెట్టుబడి పెడుతున్నారు. మైనర్ పంచాయతీలల్లో పని చేసే కార్యదర్శులు ఒక్కొక్కరు లక్ష రూపాయల వరకు పెట్టగా, మేజర్ పంచాయతీ కార్యదర్శులు రెండు లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చివర నాటి నుంచి నేటి వరకు పంచాయతీలకు ఒక్క పైసా నిధులు కూడా విడుదల కావడం లేదని పలువురు వాపోతున్నారు. గ్రామాల్లో ప్రధానంగా పారిశుధ్య పనులు, వీధి దీపాలు, సైడ్ డ్రైన్ల పూడికతీత, ట్రాక్టర్ల ద్వార చెత్త సేకరణ, డంపింగ్ యార్డు, నర్సరీల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాల్సి ఉంటుంది. వీటికి అయ్యే ఖర్చు మొత్తాన్ని కార్యదర్శులు చేతి గుండానే పెడుతున్నారు. అప్పులు చేసి మరీ పెట్టుబడులు పెడుతుండగా, కొత్త పాలక వర్గాల ఏర్పాటు తరువాత తమ పరిస్థితి ఏమిటోనని కార్యదర్శులు అంతర్మధనం చెందుతున్నారు. పైకి ఎవ్వరికి చెప్పుకోలేక, పనులు చేయకుండా ఉండలేక పరేషాన్ అవుతున్నారు.



అళ్లపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం

ఇంచార్జ్‌ల పాలనతో ప్రజల ఇక్కట్లు

బోనకల్ మండలంలో 22 గ్రామ పంచాయతీలు ఉండగా 15 గ్రామాలకు మాత్రమే కార్యదర్శులు ఉన్నారు. మిగిలిన ఏడు గ్రామాలు ఇంచార్జ్ పాలనలో నడుస్తున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల నిర్వహణ, సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న క్రమంలో పారిశుధ్య పనుల నిర్వహణ, జనన, మరణ ధృవీకరణ పత్రాల జారీతోపాటు పంచాయతీలకు సంబంధించి ప్రతి పనిని కార్యదర్శులు చేయాల్సి ఉంది. పూర్తిస్థాయిలో కార్యదర్శులు లేక పోవడంతో ఇంచార్జ్‌లుగా కొందరికి అదనపు బాధ్యతలు ఇవ్వడంతో వారికి అదనపు బారం కావడం వల్ల ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ప్రతి పనిని యాప్‌లో నమోదు చేయాల్సి ఉండడంతో రెండు చోట్ల విధుల నిర్వహణ కష్టతరంగా మారింది. సంక్షేమ పథకాల అమలులో కార్యదర్శుల పాత్ర కీలకమైనందున ప్రతి గ్రామంలో కార్యదర్శి పోస్టు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అబ్బుర పరుస్తున్న నేతిబీర కాయలు

తల్లాడ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మల్లవరం గ్రామంలోని కటికి వెంకటేశ్వర్లు అనే రైతు పొలంలో నేతిబీర తీగకు అధికంగా కాయలు కాయడం అబ్బురపరుస్తుంది. సాధారణంగా నేతిబీర తీగకు ఒక్కో చోట ఒక కాయ కాయడం సహజం కాగా ఇందుకు భిన్నంగా తీగకు ఒకేచోట 8నుంచి10 నేతిబీర కాయలు కాయడం చూసిన స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.



తీగకు ఒకేచోట కాసిన నేతిబీరకాయలు

పడిపోవడానికి సిద్ధంగా కరెంట్ స్తంభం

» విద్యుత్ అధికారుల ముందస్తు చర్యలేవి?

ఎర్రుపాలెం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రుపాలెం విద్యుత్ సెక్షన్ పరిధిలోగల మీనవోలు గ్రామంలో మీనవోలు నుండి బనిగండ్లపాడు వెళ్లేందుకు నూతనంగా నిర్మించిన ప్రధాన రహదారిని నిర్మించారు. ఆర హదారి ప్రక్కన సుమారు 25ఏళ్ల క్రితం రైతులకు వ్యవసాయ విద్యుత్ నిమిత్తం ఎస్‌ఎస్ 28 ట్రాన్సుఫార్మర్‌తో పాటు కరెంట్ స్థంభాన్ని విద్యుత్ శాఖ ఏర్పాటుచేసింది. ఈట్రాన్సుఫార్మర్ ద్వారానే మీనవోలు ఎత్తిపోతల పథకం మోటర్లకు విద్యుత్ సరఫరా అవుతుంది. తద్వారా రైతుల పంట పొలాలకు సాగునీరు అందుతుంది. నూతనంగా రోడ్డు నిర్మాణం ఏర్పాటయ్యాక ఈ మధ్యకాలంలో భారీగా కురిసిన వర్షాలకు రోడ్డుపై నీరు ప్రవహించి కరెంట్ స్థంబం చుట్టూ నీరు ప్రవహించి కరెంట్ స్థంభం చుట్టూ ఉన్న మట్టి కొట్టుకుపోయింది. దీంతో కరెంట్ స్థంభం విద్యుత్ తీగల ఆధారంగా కిందకు పడిపోకుండా నిలబడింది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వర్షానికి స్తంభం చుట్టు ఉన్న మట్టి పూర్తిగా కొట్టుకుపోయే అవకాశం ఉంది. కరెంట్ స్థంభం పడిపోతే దానితో పాటు మరికొన్ని స్థంభాలు పడిపోయే అవకాశము లేకపోలేదు ప్రస్తుతం చుట్టుపక్కల రైతులు ముమ్మరంగా వరినాట్లు వేస్తున్ననేపథ్యంలో రైతులతో పాటు రోడ్డుకు అడ్డంగా కరెంట్ తీగలు ఉండడం వల్ల ప్రయాణీకుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. విద్యుత్‌శాఖ అధికారులు ప్రమాదం జరగకముందే ముందస్తు చర్యలు తీసుకుని కొత్త కరెంట్ స్థంభం ఏర్పాటు చేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

